RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 223 మేడ్చల్ మల్కాజ్‌గిరి 4 సెప్టెంబర్ 2024 బుధవారం పేజీలు : 4

## బీజేపీ ఎన్నికల మిషన్ కాదు: మోదీ

న్యూఢిల్లీ: బీజేపీ ఎన్నికల మిషన్ కాదని, అలా చెప్పడం పార్టీని అవమాన పరచడమేనని, పార్టీ కార్యకర్తల కృషి, ధైర్యం ఫలితంగానే ఎన్నికల్లో గెలుపు ఉంటుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. జాతి కలలను తీర్మానాలుగా రూపొందించుకుని, వాటిని సాధించడం, అందుకోసం పూర్తి అంకితభావంతో పనిచేయడం చేయాలన్నారు. ఏ పార్టీని ప్రజలు అధికారంలోకి తీసుకువచ్చారో ఆ పార్టీ ప్రజాస్వామిక విలువలకు కట్టుబడుతూ, అంతర్గత ప్రజాస్వామ్యానని కాపాడుకోవాకోవాల్సి ఉంటుందన్నారు. పార్టీకి ఎన్నో తరాలవారు తమ జీవితాలను వెచ్చించారని, ఆ ఫలితమే ఈరోజు ప్రజల గుండెల్లో కమలం చిరస్థాయిగా నిలిచిందని గుర్తుచేశారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం– 'సంఘటన్ పర్వ, సదస్యత అభియాన్ 2024' కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కార్యకర్తలను ఉత్సాహపరుస్తూ ప్రధాని ప్రసంగించారు.





# ముసలోడే కానీ మహానుభావుడు!

## 70 ప్లస్‌తో పోటీ పడలేక పోయిన 50 ప్లస్!





## వరద వేళ చంద్రబాబు ముందు రేవంత్ తేలిపోయారా!?

## తెలుగు రాష్ట్రాల్లో ఇదే హాట్ టాపిక్!!

హైదరాబాద్ / అమరావతి : ఒకేలాంటి పరిస్థితులు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒకే సందర్భంలో చోటు చేసుకోవటం చాలా తక్కువ సందర్భాల్లోనే జరిగింది ఈ పదేళ్లలో. ఒకే సందర్భంలో భారీ వర్షాలు.. వరదలు లాంటివి చోటు చేసుకోవటం.. ఒకేలాంటి పరిస్థితులు రెండు రాష్ట్రాల్లో చోటు చేసుకోవటం ఇదే తొలిసారి. ఏపీలో విజయవాడ దారుణంగా ప్రభావితమైతే.. తెలంగాణలో ఖమ్మం పట్టణం ప్రభావితమైంది. అటు విజయవాడ, ఇటు ఖమ్మం పట్టణాల్లో అత్యధిక భాగం వరదనీరుతో నిండింది. లక్షలాది మంది ప్రజలు సాయాన్ని కోరుకున్న పరిస్థితి. అంతేకాదు.. రెండు రాష్ట్రాల్లోనూ ఒకే సందర్భంలో వేలాది ఎకరాల పంట దెబ్బ తినటంతో పాటు.. ఆస్తినష్టం భారీగా జరిగింది. ఇటీవల కాలంలో విపత్తులు చోటు చేసుకున్న సమయంలో మరణాల సంఖ్య తక్కువగా ఉంటే.. ఈసారి రెండు రాష్ట్రాల్లోనూ నమోదయ్యాయి.

రెండు రాష్ట్రాల్లోనూ ఒకే సందర్భంలో విరుచుకుపడిన వరద వేళ.. రెండు ప్రభుత్వాలు ఎలా స్పందించాయి? అక్కడి ప్రతిపక్షాల రియాక్షన్ ఎలా ఉంది? ముఖ్యమంత్రుల పని తీరు సంగతేంటి? లాంటి ప్రశ్నలు తలెత్తాయి. వరదల తీవ్రత రెండు రాష్ట్రాల్లోనూ ఒకేలాంటి పరిస్థితి ఉంది. రెండు రాష్ట్రాల్లోని విపక్షాలు అధికారపక్షం వైఫల్యాలపై విరుచుకుపడ్డాయి. ఏపీలో వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి సోమవారం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి.. దగ్గర దగ్గర నడుము లోతు వరకు వరద నీరు ఉన్న ప్రాంతాలకు వెళ్లి మరీ.. బాధితుల్ని పరామర్శించటం కనిపించింది. తెలంగాణలో మాత్రం అందుకు భిన్నంగా కేటీఆర్.. హరీశ్ రావులు మాత్రం సోషల్ మీడియాలో పోస్టులతో ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలు సంధించారు. వైఫల్యాలపై విరుచుకు పడ్డారు. బాధితులకు సహాయ సహకారాలు అందించే విషయంలో రెండు తెలుగు రాష్ట్రాలు పోటీ పడగా.. తెలంగాణతో పోలిస్తే ఏపీలో కాస్త మెరుగైన సహాయం అందిందన్న భావన వ్యక్తమైంది. తెలంగాణలో ముఖ్యమంత్రి మాత్రమే కాకుండా కొందరు కీలక మంత్రులు పొంగులేటి.. శ్రీధర్ బాబు లాంటి వారితో పాటు సీనియర్ నేత తుమ్మల లాంటి వారు బాధితుల వద్దకు వెళ్లి వారిని ఓదార్చే ప్రయత్నం చేయటం కనిపించింది. ఏపీలో మాత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు అంతా తానై అన్నట్లుగా వ్యవహరించారు. మంత్రి లోకేశ్ తో పాటు.. మరికొందరు సీన్ లో కనిపించినా హైలెట్ కాలేదు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాత్రం ఎక్కడా కనిపించలేదు. ముఖ్యమంత్రుల విషయానికి వస్తే.. ఏపీ సీఎం చంద్రబాబు సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకు బాధిత ప్రాంతాల్లో తిరుగుతూ.. బాధితులను ఊరడించే ప్రయత్నం చేశారు. కేవలం మూడు గంటల పాటు మాత్రమే విశ్రాంతి తీసుకున్న ఆయన సోమవారం ఉదయం ఏడున్నర గంటలకు బయటకు వచ్చేసి పనుల్లో పడ్డారు. మళ్లీ సోమవారం అర్ధరాత్రి రెండు గంటల వరకు బాధితులకు అందే సహాయ సహకారాల మీదే ఫోకస్ చేశారు. చంద్రబాబుతో పోలిస్తే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ కాస్తంత తేలిపోయారనే చెప్పాలి. అలా అని ఆయన్ను తక్కువ చేయటం కాదు కానీ.. చంద్రబాబు పడిన కష్టంతో పోల్చినప్పుడు కాస్త తక్కువగానే ఉన్నారని చెప్పాలి. ఓవైపు భాదితుల తెగ ఇబ్బంది పడుతున్నా..ఆదివారం మధ్యాహ్నం మాత్రమే ఖమ్మంకు వెళ్లిన పరిస్థితి. అదేదో మరికాస్త ముందుగా వెళ్లి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తంగా రెండు రాష్ట్రాల సీఎంలను పోల్చినప్పుడు చంద్రబాబు పని తీరు మెరుగ్గా ఉండగా.. రేవంత్ మరింత శ్రమించాల్సిన అవసరం ఉందన్న మాట పలువురి నోట వినిపిస్తోంది.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. 9 మంది మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్ బస్తర్ ప్రాంతం మరోసారి కాల్పులతో దద్దరిల్లింది. దంతెవాడ–బీజాపుర్ జిల్లాల సరిహద్దుల్లోని దండకారణ్యంలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలతో జరిగిన కాల్పుల్లో 9 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీసులు వెల్లడించారు. నిఘా వర్గాల సమాచారం మేరకు ఈ ప్రాంతంలో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, సీఆర్పీఎఫ్ బలగాలు సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలను చూసిన మావోయిస్టులు వారిపై కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు ఎదురు కాల్పులు చేపట్టాయి. ఉదయం 10.30 గంటలకు మొదలైన ఎన్‌కౌంటర్ ఇంకా కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.



ఇప్పటివరకు 9 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమైనట్లు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలంలో పెద్ద ఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఆగస్టు 29న నారాయణపుర్ జిల్లా అబూజ్‌మాడ్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు–మావోయిస్టు దళాల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఇందులో ముగ్గురు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన ఎదురుకాల్పుల ఘటనల్లో 150 మందికి పైగా మావోయిస్టులు మరణించారని పోలీసులు వెల్లడించారు.

## వరద బాధితులకు విరాళంగా 100 కోట్లు ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు ఉదారత చాటుకున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మరీ ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు ప్రజలు అతలాకుతలమైన సంగతి తెలిసిందే. తినడానికి తిండి లేక.. తాగడానికి నీళ్లు లేక పలు ప్రాంతాల ప్రజలు వరదలో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇది చూసి చలించిపోయిన ఉద్యోగులు పెద్ద మనసు చాటుకున్నారు. వరద బాధితుల కోసం ఒకరోజు వేతనం ని ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా ఇస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ మంగళవారం ఉదయం కీలక ప్రకటన చేసింది. జేఏసీ ప్రకటించిన మొత్తం విరాళం రూ.100 కోట్లు ఉంటుంది.!

**హ్యాట్సాప్..!** కాగా.. విరాళం ప్రకటించిన వారిలో ఉద్యోగులు, గెజిటెడ్ ఆఫీసర్లు, ఉపాధ్యాయులు, కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షన్‌దారులు ఉన్నారు. వీరంతా ఒకరోజు తమ జీతంను.. సెప్టెంబర్ నెల జీతం నుంచి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ మేరకు జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి ఓ ప్రకటన రిలీజ్ చేశారు. తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలతో ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ తెలిపింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అతిపెద్ద విపత్తుగా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ భావించిందని లచ్చిరెడ్డి మీడియాకు వెల్లడించారు. ఉద్యోగుల ఉదారతకు సామాన్య ప్రజలు, వరద బాధితులు, పలు రంగాల ప్రముఖులు హ్యాట్సాప్ చెబుతున్నారు. ఇదిలా ఉంటే.. వరద బాధితులకు తక్షణ సాయం కింద రూ. 10వేలు ఇవ్వాల్సిందిగా అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం వరద ప్రభావిత ప్రాంతాల్లో రెండో రోజు పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చిట్ చాట్‌లో భాగంగా ఈ ప్రకటన చేశారు.

# మాటల గారడీలు చేతకావ్




## ఫామ్ హౌస్‌లో పడుకున్నోడిలా కాను.. చెప్పిందే చేస్తా..

ఖమ్మం: చరిత్రలో ఎన్నడూ కనివిని ఎరుగన్నంత ఉపద్రవం సంభవించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇవాళ ఖమ్మంలో మీడియాతో ఆయన చిట్ చాట్ చేశారు. ఆపదలో ఉన్న తెలంగాణ ప్రజలను ఆదుకుంటామని.. ప్రజలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. తాను ఫామ్ హౌస్ లో పడుకున్నోడిలా కాదని పరోక్షంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు. తాను చెప్పిందే చేస్తానని.. చేసేదే చెబుతానని వెల్లడించారు.

తక్షణ సాయంగా బాధితుల ఇంటికి బియ్యం, ఇతర నిత్యావసరాలతో పాటు పదివేల రూపాయలు పంపిస్తున్నానని తెలిపారు. తెలంగాణకు వరదల కారణంగా రూ.5438 కోట్ల నష్టం జరిగిందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

**మోదీని కలుస్తా..** పూర్తి స్థాయి నివేదిక వచ్చిన తర్వాత ప్రభుత్వం తప్పనిసరిగా ప్రతి ఒక్క కుటుంబాన్ని ఆదుకుంటుందని రేవంత్ అన్నారు. ప్రతి ఒక్క రైతును ఆదుకుంటుందని.. ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. అమెరికా పోయి కూర్చున్నోడు తలకాయ లేకుండా మాట్లాడుతుండని విమర్శించారు.

ఇప్పటికే ప్రధానమంత్రికి లేఖ ద్వారా జరిగిన నష్టాన్ని వివరించానని రేవంత్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆదుకోవాలని ఈ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించి న్యాయం చేయాలని ప్రధాని మోదీని వెళ్లి కలుస్తానన్నారు. అనుక్షణం ఈ రాష్ట్ర ప్రజలను కాపాడుకునేందుకు కష్టపడుతున్నామన్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు.

గ్రామాలకు ప్రత్యేక బృందాలను పంపుతున్నామని రేవంత్ తెలిపారు. శానిటేషన్ దగ్గర నుంచి ప్రతి ఒక్క కుటుంబం తిరిగి కోలుకునే వరకూ అండగా నిలబడతామని వెల్లడించారు.

**మనం మెరుగే..** పక్క రాష్ట్రంతో పోల్చి చూస్తే మనం చాలా మెరుగ్గా పని చేస్తామని రేవంత్ తెలిపారు. విపత్తు నుంచి ప్రజలు కాపాడుకునేందుకు అవసరమైన అన్ని రకాల వ్యవస్థలను అప్రమత్తం చేసి ఉంచామన్నారు. పనికి మాలినోడు.. తలకాయ లేనోడు అమెరికాలో కూర్చొని ఏదో మాట్లాడుతున్నాడని విమర్శించారు. 80,000 పుస్తకాలు చదివినోడు ఫామ్ హౌస్‌లో పడుకున్నాడని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత విపత్తు జరిగితే ప్రతిపక్షంలో ఉన్నోడు నోరు మెదపలేకపోతున్నాడని విమర్శించారు.

కష్టాల్లో ఉన్న ప్రజలను కనీసం కన్నెత్తి కూడా చూడలేదన్నారు. ప్రజలు అధైర్పడాల్సిన పడాల్సిన అవసరం లేదన్నారు. ఈ ప్రభుత్వం మీకు అండగా నిలబడుతుందని రేవంత్ భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లో వ్యవస్థలను చక్కదిద్దేందుకు ప్రణాళికాబద్ధమైన కృషి జరుగుతుందన్నారు. హైడ్రా ఆగదని.. ముందుకెళుతుందన్నారు. హైదరాబాద్ పట్టణాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు తీసుకోవలసిన అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. నిపుణులు.. అనుభవజ్ఞులు.. ఇంజనీర్లతో మాట్లాడుతున్నామన్నారు. తప్పనిసరిగా హైదరాబాద్‌ను మార్చి చూపిస్తామని రేవంత్ తెలిపారు.

# సంపాదకీయం

## కాంగ్రెస్‌ను కాదని కేసీఆర్ అధికారం చేపట్టడం అంత ఈజీనా?

కేసీఆర్ అంటే తెలంగాణకు ఓ బ్రాండ్. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆయన చేసిన కృషి, పోరాట పటిమ అంతాఇంతా కాదు. ఒకవిధంగా చెప్పాలంటే కేసీఆర్ ప్రారంభించిన ఉద్యమం వల్లే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిందని చెప్పొచ్చు. ఎన్నో దీక్షలు.. ఎన్నో సభలు.. మరెన్నో సమావేశాలు నిర్వహించి తెలంగాణ ఆవశ్యకతను ఊరూరా చాటి చెప్పారు. చివరకు లక్ష్యాన్ని సాధించారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. ప్రజలు సైతం కేసీఆర్ మీద నమ్మకంతో ఆయననే సీఎం సీట్లో కూర్చోబెట్టారు. ఒక్కసారి కాదు రెండు సార్లు అధికారాన్ని కట్టబెట్టారు. 2014, 2018లో బీఆర్ఎస్ పార్టీనే గెలిపించారు. దశాబ్దకాలం పాటు రాష్ట్రంలో ఏ ఎన్నికల్లో అయినా ఆ పార్టీకే ప్రజలు పట్టం కట్టారు. రాష్ట్రంలో ఇతర పార్టీ అనేది కనిపించలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే రాష్ట్రంలో ఆ పార్టీ తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగించింది. అంత వరకు బాగానే ఉన్నా.. ఏ నినాదంతో అయితే రాష్ట్రం ఏర్పాటు జరిగిందో వాటిలో కేసీఆర్ నెరవేర్చింది ఏంటో తెలంగాణ సమాజానికి పూర్తిగా తెలిసిందే..! నీళ్ల కోసం ప్రాజెక్టులు కట్టి తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు సర్వశక్తులూ ఒడ్డారు. లక్ష కోట్లతో ఏకంగా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు. వాటితోపాటే మరికొన్ని ప్రాజెక్టులను నిర్మించారు. తెలంగాణ మొత్తానికి సాగు నీరు అందించడమే లక్ష్యంగా వాటి నిర్మాణానికి పూనుకున్నారు. అయితే.. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ ఇమేజీకి పెద్ద డ్యామేజీని తీసుకొచ్చిందనే చెప్పాలి. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా చేపట్టిన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయి. దాంతో ప్రాజెక్టు నిర్మాణంలోని వైఫల్యాలు వెలుగుచూశాయి. దాంతో ప్రజల్లోనూ మెలమెల్లగా ఆయనపై విశ్వాసం తగ్గింది. ఫైనల్లీ మొదటి సారి కేసీఆర్ పార్టీ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. 2023 నవంబర్ నాటి ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోగా కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టింది. పీసీసీ చీఫ్‌గా ప్రచారంలో దూకుడుగా వ్యవహరించిన రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు. ఆ ప్రభుత్వం కొలువుదీరి తొమ్మిది నెలలు అవుతోంది. కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుంచే బీఆర్ఎస్ వైఫల్యాలను ఒక్కొక్కటిగా వెలుగులోకి తెస్తూ ముందుకు సాగుతోంది. ఇక ఓటమి నుంచి కేసీఆర్ సైతం సైలెంటుగానే ఉండిపోయారు. ఇటీవల తన కూతురు కవిత జైలు నుంచి విడుదల కావడంతో మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ నేతలు చెబుతున్నారు. కేసీఆర్ మళ్లీ యాక్టివ్ కాబోతున్నారని.. ఇక కాంగ్రెస్ ప్రభుత్వానికి చుక్కలే అంటూ ఆ పార్టీ నేతలు గొప్పలకు పోతున్నారు. అంతేకాదు మరో అడుగు ముందుకేసి త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పోయి మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పుడు ఇది కాస్త నెట్టింటా తీవ్ర చర్చకు దారితీసింది. ప్రజలు ఎంతగానో ఆదరించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం కట్టబెడితే దానిని కూల్చడం అంత ఈజీనా..? ప్రజలు తిరస్కరిస్తేనే అధికారం కోల్పోయిన కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి ఎలా అవుతారు..? ఈ ప్రశ్నలకు సమాధానాలు బీఆర్ఎస్ నేతలకే తెలియాలి మరి!! ఇప్పటికే ఎన్నో అవినీతి, అక్రమాల విమర్శలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనేతలు, మాజీ మంత్రులు ఆ ఉచ్చు నుంచి ఎలా బయటపడుతారు..? వాటన్నింటిని పట్టించుకోకుండా మళ్లీ అధికారం చేపడుతామంటూ ప్రచారం సాగించడం ఏంటి..? కవిత జైలు నుంచి వచ్చినందుకు ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్ వస్తుండడం మంచి పరిణామమే అయినప్పటికీ.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోస్తామని చెబుతుండడం మాత్రం అది ఆయన మైలేజీకే మైనస్ అవుతుందని పలువురు రాజకీయ నిపుణుల అభిప్రాయం.

## అంగన్వాడీల్లో ఆటపాటల మధ్య విద్య బోధన నిర్వహించాలి

### మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతం







జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : అంగన్ వాడీ కేంద్రాలలోని చిన్నారులు ఆడుకుంటూ నేర్చుకునేలా పజిల్ గేమ్స్, ఆటలు ఉండేలా చూడాలని మేడ్చేల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం అంగన్ వాడీ టీచర్లను ఆదేశించారు. మంగళవారం దుండిగల్, బహదూర్ పల్లిలోని అంగన్ వాడీ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేసారు. తనిఖీలో భాగంగా అంగన్ వాడీలను పరిశీలించి ఎంత మంది పిల్లలు ఉన్నారు, వారి ఎంత వయసు, బరువు ఉన్నారని టీచర్ ను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. బలహీనంగా ఉన్న పిల్లల బరువు చూసి వారికి పౌష్టికాహారం తో పాటు దగ్గరగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించి వారికి అవసరమైన మందులు అందించాలని కలెక్టర్ సూచించారు. పిల్లలకు అందించే ఆహారం , గుడ్లు కలెక్టర్ పరీక్షించారు. మెనూ చార్ట్ ప్రకారం పిల్లలకు పరిశుభ్రమైన, రుచికరమైన భోజనం అందించాలని కలెక్టర్ తెలిపారు. పిల్లలు కలెక్టర్ కు పువ్వులు అందించి రైమ్స్ పాడి వినిపించారు. ఈ పర్యటనలో జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి, సిడిపిఓ శారద, సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనానికి గురైన 11 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసిన.... శామీర్ పేట సీఐ శ్రీనాథ్




శామీర్ పేట, (గరుడ వార్త): ఈ సంవత్సరంలో దొంగతనా నికి గురైన 11 ఫోన్లను రికవరీ చేసి, బాధితులకు శామీర్పేట సిఐ శ్రీనాథ్ అందజేశారు. ఈ సంవత్సరంలో మొత్తము 19 ఫోన్ లు పోయినట్టు పిర్యాదులు రాగా, అందులో ఇప్పటివరకు 11 ఫోన్ లను రికవరీ చేసి నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు రికవరీ చేసిన సెల్ఫోన్లను మంగళవారం ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ అందజేశారు. ఈ సందర్భంగా అట్టి ఫోన్ బాధితులు పోలీసువారికి కృతజ్ఞతలు తెలిపినారు. దొంగతనానికి గురైన ఫోన్లను రికవరీ చేసిన సంబంధిత శామీర్పేట పోలీస్ సిబ్బందిని శామీర్పేట సిఐ అభినందించారు.

## మత్తు వీడేలా చదువుకునేలా..

హైదరాబాద్ : 'చదువులో ఒత్తిడి.. జీవితంలో స్థిరపడగలమా అనే ఆందోళనల నుంచి బయటపడేందుకు అప్పుడప్పుడు వీడ్ తీసుకుంటున్నాం. అదీ మిత్రుడి ద్వారా అలవాటైంది. తప్పని తెలిసినా మరో మార్గం లేక మత్తు ద్వారా ఒత్తిడిని అధిగమిస్తున్నాం. ఈ ఒక్కసారికి మన్నించండి. మరోసారి ఇటువంటి తప్పిదానికి పాల్పడం". ప్రభుత్వ వైద్యకళాశాలలోని ఇద్దరు జూనియర్ డాక్టర్ల అభ్యర్థన.
'మా క్యాంపస్‌లో డ్రగ్స్ ఆనవాళ్లు కనిపించవు. అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు ఉన్న మా సంస్థపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. హాస్టల్స్‌లో వార్డెన్‌లు చాలా అప్రమత్తంగా ఉంటారు. ఇటీవల ఖరీదైన మాదకద్రవ్యాలు వాడుతున్నట్లు గుర్తించిన విద్యాసంస్థ ప్రతినిధి బుకాయింపు. అయితే, అక్కడ చదివే పిల్లల్ని ప్రశ్నిస్తే రెండేళ్లుగా తాము ఎల్ఎస్‌డీబ్లాట్స్, ఓజీ(ఓషన్‌గ్రోన్)గంజాయి హాస్టల్‌లోనే వాడుతున్నట్లు చెప్పారు'.'సార్.. మా అబ్బాయి డ్రగ్స్‌కు అలవాటుపడినట్లు తెలియదు. మంచి ర్యాంక్ సాధించి సీటు తెచ్చుకు న్నాడు. అంత తెలివైనవాడిపై మీరు అభాండాలు మోపడం తగదు. ప్రభుత్వ శాఖలో ఉన్నతహోదాలో ఉన్న ఒక తల్లి వాదన. దీంతో అక్కడికక్కడే ఆ విద్యార్థికి వైద్యపరీక్ష నిర్వహించి డ్రగ్స్ వాడుతున్నట్లు తేల్చారు'.

**పోలీసు దాడులతో వెలుగులోకి సంచలనాలు**

షాద్‌నగర్ సమీపంలోని ప్రముఖ విద్యాసంస్థలో వేల మంది విద్యార్థులుండగా.. అధికశాతం ఉన్నత కుటుంబాల నుంచి వచ్చినవారే. వారిలో 40 శాతం మంది మత్తుపదార్థాలకు అలవాటుపడినట్లు తాజా తనిఖీల్లో వెలుగుచూశాయి. శామీర్‌పేట్ వద్ద ఉన్న ప్రఖ్యాత విద్యాలయంలోనూ ఇదే పరిస్థితి. ప్రభుత్వ వైద్యకళాశాలలో జూనియర్ డాక్టర్లు గంజాయి మత్తులో జోగుతున్న ఘటన కలకలం సృష్టించింది. ధూల్‌పేట్‌లో గంజాయి ప్యాకెట్లు కొనుగోలు చేసేందుకు వెళ్లి పట్టుబడిన 2400 మందికి ఎక్సైజ్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. వీరిలో 1500 మంది ఇంటర్ నుంచి పీజీ చదువుతున్న విద్యార్థులే ఉన్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ మొదలు.. నానరామ్‌గూడ ఐటీ సెక్టార్ వరకు మత్తులో జోగుతున్న యువతను చూసి వారు ఉలికిపాటుకు గురవుతున్నారు. తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో(టీజీన్యాబ్) దాడుల్లో సంచలనం కలిగించే విషయాలు వెలుగులోకి వచ్చాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నాలుగు ప్రముఖ విద్యాసంస్థల్లో చదువుతున్న వందల మంది విద్యార్థులు మత్తు ఉచ్చులో చిక్కి విలవిల్లాడుతున్నట్లు నిర్ధారించారు. యాంటీడ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయకపోవడాన్ని గుర్తించిన టీజీన్యాబ్ డైరెక్టర్ సందీప్‌శాండిల్య.. ప్రముఖ విద్యాసంస్థ ఛైర్మన్‌ను గట్టిగా మందలించినట్టు సమాచారం.

**ఆపేదెవరు.. అడిగేదెవరు**



నగరం సహా శివారు ప్రాంతాల్లో జాతీయ, అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో కూడిన వర్సిటీల్లో దేశవిదేశాలకు చెందిన లక్షల మంది ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు. వాటిల్లో అనుభవం ఉన్న బోధనా నిపుణులు, అద్భుతమైన సంరక్షణ ఉందని ధీమాగా ఉన్న తల్లిదండ్రులు ఉలికిపాటుకు గురయ్యే ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. నాలుగు విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు గంజాయి, కొకైన్, ఓజీ, ఎల్ఎస్‌డీ బ్లాట్స్ తీసుకుంటున్నట్టు టీజీన్యాబ్ తనిఖీల్లో బయడపడ్డాయి. ఎత్తయిన గోడలు.. బయటివ్యక్తులు లోపలికెళ్లకుండా పటిష్ఠ భద్రత ఉన్న ఆ ప్రాంగణాల్లోకీ డ్రగ్స్ చేరుతున్నాయి. అక్కడినుంచి యథేచ్ఛగా బయటకు వస్తున్న విద్యార్థులూ ధూల్‌పేట్, నానక్‌రామ్‌గూడ, శంషాబాద్, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లోని పెడ్లర్స్ నుంచి కావాల్సిన డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారు. హాస్టల్ గదుల్లోకి మత్తుపదార్థాలను తీసుకెళ్లి అక్కడే స్నేహితుల మధ్య వాటిని తీసుకుంటున్నారు. హాస్టల్‌లో విద్యార్థులను పర్యవేక్షించాల్సిన వార్డెన్‌లు రాత్రి 9 గంటలు దాటగానే ఇళ్లకు చేరుతున్నారు. ఈ క్రమంలో ప్రైవేటు భద్రతా సిబ్బందికి కాసులు ఎరవేసి.. బయటకొచ్చి పనిముగించుకొని గదులకు తిరిగి చేరుతున్నట్టు పోలీసుల దర్యాప్తులో విద్యార్థులు వెల్లడించినట్లు సమాచారం. శామీర్‌పేట్‌లోని ఒక విద్యాసంస్థలో పరిస్థితి చేయిదాటిందని... అక్కడ చదువుతున్న ప్రతి పది మందిలో ఇద్దరు మత్తుపదార్థాలు తీసుకుంటున్నట్టు తెలిసిందని పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. తమకు దొరికిన స్వేచ్ఛతో అధికశాతం విద్యార్థులు స్నేహితుల ప్రభావంతో తొలుత రుచి చూసేందుకు మత్తుకు దగ్గరవుతున్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ

శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళ వారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద





శామీర్ పేట కు చెందిన దేశం బాలరాజ్ గౌడ్- శివరాణి దంపతులు, తూముకుంటకు చెందిన భాస్కర్ చారి, శ్రీనివాస్ చారి, శామీర్ పేటకు చెందిన బత్తిని వెంకటేష్ గౌడ్- సౌందర్య దంపతులు, దేశం నరేష్ గౌడ్ (పోలీస్)- జ్యోతి దంపతులు, తూముకుంట శేఖర్ గౌడ్- రాజేశ్వరి, శామీర్ పేట గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## కాన్పు.. వసూళ్ల త్రేన్పు!

కొత్తగూడెం : కొత్తగూడెం పట్టణం రామవరంలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)లో సేవలు పొందాలంటే అడిగినంత ముట్టజెప్పాల్సి వస్తోందని బాలింతలు, గర్భిణుల కుటుంబాలు వాపోతున్నాయి. ఇక్కడ పలు విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు కార్మికులు చేయి తడపనిదే సేవలు అందించే పరిస్థితి లేదని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కాన్పుల విషయంలో వైద్యుల ఖర్చుల పేరుతో డబ్బులు తాగుతున్నారని బాధిత పేద కుటుంబాలు పేర్కొంటున్నాయి. అడిగినంత ఇవ్వకపోతే దౌర్జన్యానికీ వెరవడం లేదని వాపోతున్నారు. పైగా, 'ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తే జేబులు గుల్ల చేయరా? మాకివ్వడానికే పేదరికం అడ్డొస్తుందేమిటో?' అని సూటిపోటు మాటలు అంటున్నారని తెలుస్తోంది. వార్డులు శుభ్రం చేసే దగ్గర్నుంచి ఉచితంగా సేవలందించాల్సి '102' అంబులెన్స్ సదుపాయం వరకు ఒక్కో రేటు ఖాయం చేశారు. 'కాన్పు చేయించుకుందామని వస్తే రూ.5 వేల వరకు ఖర్చవుతోంది. శుభ్రపరిచే రసాయనాలు, సబ్బుల ఖర్చులనూ మాపైనే మోపుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేపట్టాలి' అని బాధితులు కోరుతున్నారు.
దూర ప్రాంతానికి చెందిన నిండు గర్భిణి నాలుగు రోజుల క్రితం పురిటినొప్పులు రావడంతో ఆసుపత్రిలో చేరింది. నొప్పులు భరించలేను.. ప్రసవం చేయాలని ఆమె ప్రాధేయపడినా సిబ్బంది స్పందించలేదు. పైగా చీదరించుకున్నారు. ఆ ఛీత్కారాలు తట్టుకోలేక గర్భిణిని కుటుంబీకులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.
భద్రాచలం సబ్ డివిజన్ పరిధి నుంచి మూడో కాన్పు నిమిత్తం ఓ పేదరాలైన గర్భిణి ఎంసీహెచ్‌లో చేరింది. ఆమె వద్ద తల్లి తప్పితే ఎవరూ లేరు. కాన్పు తర్వాత అడిగినంత డబ్బులివ్వాలని ఆమెపై కాంట్రాక్టు కార్మికులు ఒత్తిడి తెచ్చారు. తమ వద్ద లేవని వారు ప్రాధేయపడినా వినలేదు. చేసేది లేక తమ వద్దనున్న కొంత మొత్తాన్ని ముట్టజెప్పాల్సి వచ్చింది.
చర్ల మండలానికి చెందిన మరో నిండు గర్భిణి ఇటీవల ఆసుపత్రికి వచ్చింది. ఆమె ఉన్న వార్డు పారిశుద్ధ్య కార్మికులు రూ.200 వసూలు చేశారు. కాన్పు తర్వాత వాహనంలో ఇంటి వద్ద దింపినందుకు మరో రూ.600లు సమర్పించుకోవాల్సి వచ్చింది.

వసూళ్ల తీరు ఇలా..
(పలువురు బాధితుల పరిశీలన ఆధారంగా..)
జనరల్ వార్డులో ఊడ్చేవారికి: రూ.200
కాన్పులవార్డు వద్ద ఆయాకు: రూ.600
కాన్పుల వార్డు నుంచి జనరల్ వార్డుకు చేర్చినందుకు: రూ.500
ప్రసవం ఖర్చులు (వైద్యులు సహా): రూ.3,000
కాన్పు తర్వాత ఇంటికి వాహనంలో చేర్చినందుకు: రూ.600
పుట్టిన బిడ్డను శుభ్రం చేసినందుకు: రూ.300

**రామవరం ఎంసీహెచ్ ఆసుపత్రి భవనం**

ఆసుపత్రిలో కొందరు సిబ్బంది ఖర్చుల పేరుతో డబ్బులు తీసుకుంటున్నారని మా దృష్టికి పలువురు తీసుకొచ్చారు. ఇది తగదని కాంట్రాక్టు సిబ్బందిని హెచ్చరిస్తూనే ఉన్నాం. నిర్వహణ అంశంపై తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నాం. రోగుల వద్ద డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాం. ఏ సేవలైనా ఆసుపత్రిలో ఉచితమని ఈ సందర్భంగా ప్రజలకు సూచిస్తున్నాను. ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే మాకు చెప్పాలి. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. '102'లో ఇంటికి ఉచితంగా చేర్చాలనేది నిబంధన. డబ్బులు వసూలు చేస్తున్న వైనాన్ని డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకెళ్తా.డా.కె.వీరబాబు, ఎంసీహెచ్ ఆర్ఎంఓ

# సూర్యఘర్‌కి అవినీతి మరక

హైదరాబాద్ : పీఏం సూర్యఘర్‌కి అవినీతి మరక అంటింది. గృహాలపై సౌర విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే చాలు తనిఖీల పేరుతో మీటర్ జారీ, బిగింపు వరకు ప్రతి దశలో కొందరు రెడ్కో అధికారులు, డిస్కం సిబ్బంది కొందరు దబాయించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఏజెన్సీల నుంచి వీటిని వసూలు చేస్తున్నా.. అంతిమంగా ఆ భారం వినియోగదారులపై పడుతోంది.

ఇదీ పథకం: ఇళ్లపై సౌర విద్యుదుత్పత్తితో ప్రతి నెలా 300 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తు పొందేందుకు కేంద్రం పీఏం సూర్యఘర్ పథకం తీసుకొచ్చింది. 3 కిలోవాట్ల సౌర పలకలు ఏర్పాటు చేసుకోవాలంటే రూ.2,06,400 అవుతుంది. నెట్‌మీటర్‌కు



రూ.2950, సబ్సిడీ దరఖాస్తుకు రూ.1770 చెల్లించాలి. ప్రభుత్వం నుంచి నేరుగా వినియోగదారుడి ఖాతాకు రూ.78వేల సబ్సిడీ వస్తుంది. సబ్సిడీ కాకుండా వినియోగదారుడు 3 కిలోవాట్లకు తమ జేబు నుంచి రూ.1,33,120 వ్యయం చేస్తున్నారు.

లంచాలు ఇవ్వకపోతే..: తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరనీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో) నోడల్ ఏజెన్సీగా ఉంది. ఇళ్లపై ఏజెన్సీలు సౌర పలకలు ఏర్పాటు చేసిన తర్వాత రెడ్కో జిల్లా మేనేజర్లు తనిఖీ చేసి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఇక్కడే 3 కిలోవాట్ల ప్లాంట్ తనిఖీకి కొందరు మేనేజర్లు రూ.5వేలు వసూలు చేస్తున్నారు. కిలోవాట్‌కు వెయ్యి అన్నారు కదా అని ఎవరైనా అంటే.. తనిఖీల్లో జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విద్యుత్తు పంపిణీ సంస్థలో మరొక విధంగా వసూళ్లు చేస్తున్నారు. సింగిల్ ఫేజ్, త్రిఫేజ్ మీటర్ల ఆధారంగా వసూలు చేస్తున్నారు. నెట్ మీటర్ జారీ కావాలంటే అక్కడ ఉన్న కొందరు సిబ్బంది వెయ్యి దాకా తీసుకుంటున్నారు.

# పైసా వసూల్

హైదరాబాద్: హైదరాబాద్ చుట్టూ ఉన్న చెరువుల హద్దుల్లో బఫర్‌జోన్లను కొందరు నీటిపారుదలశాఖ అధికారులు మార్చారని రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధికారులు గుర్తించారు. ఐటీకారిడార్... శంషాబాద్ విమానాశ్రయం... బాహ్యవలయ రహదారుల పరిసర ప్రాంతాల్లో జలవనరులు.. చెరువుల బఫర్‌జోన్లలో ఈ మార్పులు చేర్పులు చేశారు. రెండు జిల్లాల నీటిపారుదల శాఖ అధికారుల్లో కొందరు సహకారం అందించారు. ఎఫ్‌టీఎల్.. బఫర్‌జోన్ హద్దులను గుర్తించేక్రమంలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి.

ఇక్కడ ఇలా: రంగారెడి మేడ్చల్ జిల్లాలో 1820 చెరువులుండగా... 10శాతం చెరువుల ఎఫ్‌టీఎల్‌లు, బఫర్‌జోన్లు మారిపోయాయంటూ స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

శేరిలింగంపల్లి మండలంలోని రాయదుర్గం, ఖాజాగూడ చెరువుల




బఫర్‌జోన్లలో వాణిజ్య సముదాయాలు వెలిశాయి.

శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో రెండు చెరువులను పూడ్చేసి విల్లాలు నిర్మిస్తున్నారు. పట్టించుకోరని..: సహజసిద్ధమైన నీటివనరులు, చెరువులు అధికంగా ఉన్న గండిపేట్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, శంషాబాద్, కూకట్‌పల్లి, మేడ్చల్, ఉప్పల్, ఘట్‌కేసర్ మండలాల్లో నీటిపారుదలశాఖ అధికారులు చెరువుల బఫర్‌జోన్లు, ఎఫ్‌టీఎల్‌లు మార్చేశారు గండిపేట్ మండలంలో ఒక చెరువు బఫర్‌జోన్‌కు వెలుపల రియల్ వెంచర్ ప్రతినిధులు విల్లాలు నిర్మించేందుకు అనుమతులు ఇచ్చారు. ఇక్కడ 18 విల్లాలను నిర్మించారు.

మేడ్చల్ మండలం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో రెండు చెరువుల్లో కొన్నేళ్ల నుంచి ప్రవాహం ఆగిపోవడంతో బఫర్‌జోన్‌ను 20 మీ. వెనక్కి జరిపారు. ఇరిగేషన్‌శాఖ ఇళ్లకు నిరభ్యంతర పత్రాలు ఇచ్చింది.

# హైడ్రా నిఘా ఎల్‌ఆర్‌ఎస్‌కు సెగ

హైదరాబాద్: హైడ్రా దెబ్బకు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన, పరిష్కారంలో మార్పులు చేర్పులు జరుగుతున్నాయి. గతంలో బల్దియా, హెచ్‌ఎండీఏ ఇతర మున్సిపాలిటీల పరిధిలో దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేవారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను పెద్దగా పట్టించుకోలేదు. చెరువు సమీపంలో ఉంటే మాత్రం వాటిని తిరస్కరించేవారు. హైడ్రా కొరడా ఝుళిపిస్తుండటంతో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియలో నీటిపారుదల, రెవెన్యూ శాఖలను కూడా భాగస్వామ్యం చేశారు. ప్రస్తుతం హెచ్‌ఎండీఏలో 3.58 లక్షల ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పెండిం



గ్‌లో ఉన్నాయి. ఇప్పటివరకు 200 దరఖాస్తులలోపే అనుమతులు ఇచ్చారు. చాలా లేఅవుట్లు చెరువు శిఖం, బఫర్‌జోన్లు, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయి. ఇప్పుడు గత రెండు దశాబ్దాల చెరువు ఎఫ్‌టీఎల్, పంచాయతీ మ్యాపులను పరిశీలిస్తున్నారు. సంబంధిత విభాగాల నుంచి ఎన్‌వోసీ తీసుకున్న తర్వాత మరోసారి హెచ్‌ఎండీఏ అధికారులు తనిఖీలు చేసి ఎలాంటి ఇబ్బందులు లేవని నిర్ణయానికి వచ్చిన తర్వాత దరఖాస్తులను ఎల్‌ఆర్‌ఎస్‌కు అనుమతి ఇవ్వాలని నిర్ణయించారు.

# చదువే లోకం.. పుస్తకంతో మమేకం



కరీంనగర్: సర్కారు కొలువుల ఆశలు నెరవేర్చే గ్రూప్స్ పోటీ పరీక్షలకు ఉమ్మడి జిల్లా యువత సన్నద్ధమవుతున్నారు.. కోరుకున్న కొలువును సాధించాలనే కృతనిశ్చయంతో రేయింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. అక్టోబరు 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ఉండటంతోపాటు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో టీఎస్‌పీఎస్సీ గ్రూప్-2, 3 పరీక్షలను నవంబరు, డిసెంబరులో నిర్వహిస్తామని ప్రకటించడంతో ఉన్న సమయానికి అనుగుణంగా సన్నద్ధమవుతున్నారు.

**లక్ష మందికి పైగా..**

గ్రూప్స్, బ్యాంక్ ఉద్యోగాలు, ఇతర పోటీ పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు లక్షమందికిపైగా ఉద్యోగార్థులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో దాదాపుగా 30శాతం మంది మాత్రం గ్రంథాలయాలు, రీడింగ్స్ రూమ్‌లకే పరిమితమవుతున్నారు. ఈ ఏడాది జూన్ 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు నాలుగు జిల్లాల పరిధిలో 29,151 మంది రాశారు. ఇందులో అర్హత సాధించిన వారు అక్టోబరులో నిర్వహించనున్న మెయిన్స్‌కు సిద్ధమవుతున్నారు. ఇలా గ్రూప్-1 తోపాటు గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను దాదాపుగా 80 వేల మంది వరకు రాసే అవకాశముంది.

**అధికారుల సూచనలిలా..**

లక్ష్యం నిర్దేశించుకోవడమే కాదు.. అందుకు వారు ప్రణాళికాబద్ధంగా కృషి చేశారు.. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని చదివారు.. వివిధ క్యాడర్ అధికారులుగా స్థిరపడ్డారు.. అక్టోబరు.. నవంబరు.. డిసెంబరులలో గ్రూప్-1, 2, 3 పరీక్షలు ఉన్న నేపథ్యంలో వారితో మాట్లాడగా ఉద్యోగార్థులకు విలువైన సూచనలిచ్చారు..

**అదనపు సమయం కేటాయించండి**

భావన

ఎంసెట్‌లో మంచి ర్యాంకు వచ్చింది. అయినా ఇంజినీరింగ్ వైపు వెళ్లకుండా డిగ్రీ చదివి, గ్రూప్స్ పరీక్షలు రాయాలని నాన్న అన్నారు. మొదటి నుంచి ప్రభుత్వ అధికారిగా ఎక్కువ మందికి మేలు చేయవచ్చనే ఆలోచన ఉండటంతో సన్నద్ధమయ్యా. మాది ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం. అమ్మా-నాన్న భారతి, చిన్నయ్య. 2015లో హైదరాబాద్‌లో బీఎస్సీ పూర్తి చేశాక.. అక్కడే గ్రూప్-2కు 8 నెలలు శిక్షణ తీసుకున్నా. నిత్యం 10 నుంచి 12 గంటలు చదివేది. ఎన్ని గంటలు చదివామన్నది కాదు.. చదివింది ఎంత గుర్తుంచుకున్నామన్నది ముఖ్యం. 2016లో పరీక్ష రాయగా 2019లో ఫలితాలు విడుదలై 2020లో ఎన్పీడీసీఎల్ రెవెన్యూ రికవరీ అధికారిగా పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పుడు గ్రూప్-2 రాసేవారికి తక్కువ సమయం ఉంది. కొత్త పుస్తకాల జోలికి వెళ్లకుండా ఇప్పటి వరకు చదివిన వి పునశ్చరణ చేసుకోండి. సిలబస్ పూర్తి కాకుంటే అదనపు సమయం కేటాయించుకుని చదవండి.

భావన, ఎన్పీడీసీఎల్, కరీంనగర్ సర్కిల్

**ఇది పునశ్చరణ సమయం..**

మాది జగిత్యాల జిల్లా కొడిమ్యాల. మేము ముగ్గురం అక్కచెల్లెళ్లం. అక్క ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. చెల్లి బ్యాంకు అధికారిగా పని చేస్తున్నారు. 2006లో ఎంకాం, బీఈడీ పూర్తి చేసిన తరువాత డీఎస్సీ కోసం సన్నద్ధమయ్యా. ఇదే సమయంలో గ్రూప్-2 కోసం ప్రయత్నించగా మొదటి ప్రయత్నంలోనే వాణిజ్య పన్నుల శాఖలో ఏసీటీవోగా ఉద్యోగం సాధించా. తరవాత గ్రూప్-1 కోసం 2011లో మే నుంచి సెప్టెంబరు వరకు హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకున్నా. తక్కువ సమయం ఉండటంతో రోజుకు 14 గంటల పాటు చదివేది. 2011 సెప్టెంబరులో జరిగిన గ్రూప్-1 పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 11వ ర్యాంకు రాగా నిర్మల్ ఆర్డీవోగా పోస్టింగ్ అభించింది. ప్రస్తుతం గ్రూప్-1, 2, 3 సిద్ధమవుతున్నవారు ఉన్న తక్కువ సమయాన్ని ఏమాత్రం వృథా చేయకుండా కష్టపడాలి. ఇది పునశ్చరణ సమయం. ప్రతి నిమిషం విలువైనదే.. పక్కా ప్రణాళిక వేసుకుని చదువుకుంటూ నోట్స్ రాసుకోవాలి. గతంలో చదివినవన్నీ పునశ్చరణ చేసుకోవాలి.

జె. అరుణశ్రీ, జిల్లా అదనపు పాలనాధికారి, పెద్దపల్లి

**అంశాలపై స్నేహితులతో చర్చించండి..**

మాది ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోహెడ మండలం వింజపల్లి. కరీంనగర్‌లో డిగ్రీ చేసిన తరవాత ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో టీటీసీ చేసి కొడిమ్యాల మండలంలో ఉపాధ్యాయురాలిగా చేరా. పత్రికల్లో అధికారుల స్ఫూర్తి కథనాలు చదివి ప్రభుత్వ అధికారిని అయితే ఎక్కువ మంది ప్రజలకు సేవ చేయొచ్చని భావించి గ్రూప్-2కు సన్నద్ధమయ్యా. 2010లో గ్రూప్-2 సాధించి కరీంనగర్‌లో సీనియర్ అకౌంట్స్ అధికారిగా ఉద్యోగం పొందా. ప్రస్తుతం సిరిసిల్లలో ఉప కోశాధికారిగా విధులు నిర్వహిస్తున్నా. ఇప్పుడు సిలబస్‌లో బాగా మార్పు వచ్చింది. ముఖ్యంగా సమకాలీన అంశాలు, తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమం గురించి లోతుగా అధ్యయనం చేయండి. మీలాగే సన్నద్ధమవుతున్న స్నేహితులతో వివిధ అంశాలపై చర్చ పెట్టుకోవడం ద్వారా మరింత బాగా గుర్తుంచుకోవచ్చు.

అన్నాడి కవిత, ఉప కోశాధికారి, సిరిసిల్ల

**ఉన్న సమయానికి ప్రణాళిక వేసుకోండి..**

మాది చొప్పదండి. బీఎస్సీ, బీఈడీ పూర్తయిన తరువాత 2004లో డీఎస్సీ రాసి రెండో ర్యాంకుతో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా నియమితులయ్యా. అదే సమయంలో స్నేహితుల ప్రోత్సాహంతో గ్రూప్-2కు సిద్ధమయ్యా. రోజూ 10 గంటలు చదివేవాడిని. పాత పరీక్ష ప్రశ్నాపత్రాలను అధ్యయనం చేసి చదివేది. జోన్‌లో 2 ర్యాంక్ సాధించడం ద్వారా 2009లో గంభీరావుపేట మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా చేరా. ప్రస్తుతం గ్రూప్-2 సన్నద్ధమయ్యేవారికి తక్కువ సమయం ఉంది. హడావుడి పడొద్దు. సిలబస్ పూర్తి చేసి ఉంటే సరి. లేదంటే ఉన్న సమయాన్ని పకడ్బందీగా వాడుకోవాలి. ముఖ్యమైన అంశాలు చదువుకోవడంతోపాటు పునశ్చరణకు సమయం కేటాయించాలి.

బొద్దుల గంగయ్య, ఆర్డీవో, పెద్దపల్లి

# చెరువుల శిఖం కబ్జా.. యథేచ్ఛగా నిర్మాణాలు



పెద్దపల్లి: కబ్జారాయుళ్లు చెరువు శిఖాలను వదలడం లేదు. కాదేదీ కబ్జాకు అనర్హమనే చందంగా చెరువు శిఖం, బఫర్ జోన్లలోనూ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. రాష్ట్ర రాజధానిలో నీటివనరులను ఆక్రమించి చేపట్టిన అక్రమ కట్టడాలను హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేస్తున్నారు. ఇదే తరహాలో రామగుండం నగరపాలక సంస్థతో పాటు పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పురపాలికల్లో చెరువులను కబ్జా చేసే వారిపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. గతంలో కలెక్టర్ ఆధ్వర్యంలో చెరువుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పలు కట్టడాలను కూల్చివేశారు. ఆయా నిర్మాణాలను అక్రమార్కులు మళ్లీ చేపట్టారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎన్ని అక్రమ కట్టడాలు ఉన్నాయి? ఎన్ని కూల్చివేశారు? అనే విషయాలను పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్‌తో 'ఈనాడు' ప్రస్తావించింది. బంధంపల్లి వద్ద రెండు నిర్మాణాలు మాత్రమే ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. పూర్తిస్థాయిలో గుర్తించాల్సిన బాధ్యత నీటిపారుదల శాఖ అధికారులపై ఉందన్నారు. ఇదే విషయాన్ని జిల్లా నీటిపారుదలశాఖ పర్యవేక్షక ఇంజినీర్(ఎస్‌ఈ) సత్యరాజ్‌చంద్ర వద్ద ప్రస్తావించగా సుల్తానాబాద్‌లో గర్రెపల్లి, పెద్దపల్లిలో బంధంపల్లి, రామగుండంలో మల్యాపూర్ చెరువుల వద్ద గతంలో ఎఫ్‌టీఎల్ గుర్తించామని తెలిపారు. ప్రత్యేకంగా బఫర్ జోన్లను రెవెన్యూ అధికారులు గుర్తించాల్సి ఉంది. కలెక్టర్ ఆదేశాల మేరకు మరోసారి చెరువులన్నింటి వద్ద ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను గుర్తిస్తాం.

ఎఫ్‌టీఎల్ పరిధిలో...

జిల్లావ్యాప్తంగా మొత్తం 1,016 చెరువులు ఉంటే ఇందులో పెద్దవి 700 వరకు ఉన్నాయి. చెరువు శిఖం భూముల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ గృహ, భవన నిర్మాణాలు చేపట్ట వద్దని భారత అత్యున్నత న్యాయస్థానం గతంలోనే తీర్పు వెలువరించింది.

చెరువుల గరిష్ఠనీటి నిల్వ ఎఫ్‌టీఎల్(ఫుల్‌ట్యాంక్ లెవల్) నిబంధనలను ఉల్లంఘించి రామగుండం నియోజకవర్గంలో గతంలో మల్యాపూర్ చెరువు, ఎన్టీపీసీ సమీపంలోని నర్రశాలపల్లి మాలకుంట చెరువుల్లో కొందరు కబ్జాదారులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. పెద్దపల్లిలోని బంధంపల్లి చెరువు, బందారి కుంట, రంగంపల్లి చెరువు, నిట్టూరు గ్రామ చెరువు, ఎల్లమ్మ-గుండమ్మ చెరువుల్లోనూ ఎఫ్‌టీఎల్ నిబంధనలను పలువురు తుంగలో తొక్కి నిర్మాణాలు చేపట్టినప్పటికీ పురపాలిక శాఖాధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలున్నాయి. సుల్తానాబాద్ పురపాలక సంఘం పరిధిలోని గర్రెపల్లి చెరువులో ఏకంగా ఓ స్థిరాస్తి వ్యాపారి ఎఫ్‌టీఎల్ పరిధిలో తాత్కాలికంగా రేకుల షెడ్డునే నిర్మించాడు. గట్టెపల్లి, నీరుకుళ్ల, సుల్తానాబాద్ బస్టాండ్‌కు సమీపంలోని పెద్ద చెరువు బఫర్‌జోన్లలోనూ అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నప్పటికి అధికారులు ఎలాంటి కూల్చివేతలు చేపట్టకపోవడం పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# విద్యుత్తు సిబ్బంది ఇష్టారాజ్యం... వినియోగదారుడికి నరకప్రాయం

జుక్కల్: తెలిసో.. తెలియకో ఎన్నో పొరపాట్లు చేస్తుంటాం. తెలిశాక వాటిని సరిదిద్దుకోవాల్సిన బాధ్యత మనమీదే ఉంటుంది. కానీ కరెంటోళ్ల పనితీరుతో ఓ కుటుంబం చీకట్లోకి వెళ్లింది. తప్పును ఒప్పుకోక.. బెదిరింపు చర్యలకు పాల్పడి ఓ వినియోగదారుడిని ముప్పు తిప్పలు పెట్టిన సంఘటన జుక్కల్ మండల కేంద్రంలో చోటుచేసుకొంది. బాధితుడు సుర్‌నార్ మల్హరి తెలిపిన వివరాల ప్రకారం.. ఆయన ఇంటికో విద్యుత్తు మీటరు ఉంది. 2023 నవంబరు 3న బిల్లు చేతికిచ్చారు. అందులో 1136 యూనిట్ల రీడింగ్ ఉందని, రూ. 1553 బిల్లు చెల్లించాలని ఉంది. వాస్తవానికి రీడింగ్ 936 యూనిట్లే ఉంది. ఇది గమనించిన బాధితుడు రీడింగ్ ఎక్కువ కొట్టారని, బిల్లు ఎక్కువ వచ్చిందని వాపోయారు. సరే సరిదిద్దుతామంటూ 8 నెలల నుంచి సతాయిస్తున్నారు. ప్రతి నెలా బిల్లు ఇస్తూనే ఉన్నారు. చివరికి 2024 జులై 2 బిల్లు కొట్టారు. అందులోనూ 1136 యూనిట్ల రీడింగ్ ఉన్నట్లు చూపారు. 8 నెలల్లో ఒక్క యూనిట్ కూడా వాడలేదా..? అంటే అదీ లేదు. విద్యుత్తు వాడుతూనే ఉన్నారు. మీటర్‌లో రీడింగ్ పెరుగుతూనే ఉంది. కానీ బిల్లులో మాత్రం అంతే ఉంది. జులైలో రూ. 3015 బిల్లు వచ్చిందని, చెల్లించకపోతే కనెక్షన్ కట్ చేస్తామంటూ హెచ్చరించారు. మీరు అధిక రీడింగ్ నమోదు చేసి, బిల్లు పెంచితే తామెందుకు చెల్లించాలని ప్రశ్నిస్తే జేఎల్‌ఎం సాయిలు బెదిరింపులకు పాల్పడ్డారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల విద్యుత్తు కనెక్షన్ తొలగించి, చీకట్లోకి నెట్టారు. గత్యంతరం లేక బెదిరింపులకు భయపడి బాధితుడు రూ. 2700 చెల్లించడంతో మళ్లీ విద్యుత్తు సరఫరా పునరుద్ధరించారు. ప్రస్తుతం ఆ మీటరు రీడింగ్ 1089 యూనిట్లు చూపెడుతోంది. ఎనిమిది నెలల క్రితమే 1136 యూనిట్ల వాడకం పేరుతో బిల్లు ఇవ్వడం కొసమెరుపు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' ఏఈ మోహన్‌ను వివరణ కోరగా.. సమస్య తన దృష్టికి రాలేదని, లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే.. రీడింగ్‌ను సరి చేసి బిల్లులో మార్పు చేస్తామని, బిల్లు తగ్గిస్తామని చెప్పారు.

# ఉపాధి.. సామాజిక ప్రగతి

సంగారెడ్డి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్‌ఆర్‌ఈజీఎస్) అమలులో భాగంగా ప్రభుత్వం పనుల ఎంపికలో సంస్కరణలు చేపడుతోంది. ప్రస్తుతం గ్రామానికి అయిదు కిలో మీటర్ల పరిధిలో కూలీలకు సాగు కాల్వల్లో పూడిక తీత, నర్సరీల్లో మొక్కల పెంపకం, నాటడం తదితర పనులు చేపడుతున్నారు. ఈ ఏడాది నుంచి పాత పనులు కొనసాగిస్తూనే.. సామాజిక అభివృద్ధి దిశగా ప్రగతి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా విద్య, వైద్యం, పశు సంపద, నీటి వనరుల సంరక్షణకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పల్లెల్లో ముందస్తుగా చేపట్టిన సర్వే ఆధారంగా నిధులు ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాచరణ రూపొందించింది.

466 పనులు.. రూ.25.68 కోట్ల నిధులు

జిల్లాలో 25 మండలాలు... 647 గ్రామ పంచాయతీలున్నాయి. 639 పల్లెల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలవుతోంది. ఈ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా మెటీరియల్ కాంపోనెంట్ కింద 466 పనులను గుర్తించారు. రూ.25.68 కోట్ల నిధులు అవసరమవుతాయని అంచనా వేశారు. ప్రభుత్వ పాఠశాలల ప్రహరీలు, వంట గదుల నిర్మాణాలు, వాన నీటి సంరక్షణ పనులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో




శౌచాలయాలు, పల్లెల్లో పశువుల పాకలు, జీవాల పెంపకం, మేకలు, కోళ్ల షెడ్ల నిర్మాణం తదితర పనులు చేపట్టనున్నారు.

గుర్తించిన పనులిలా..

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీలు: 132

వంట గదులు నిర్మాణాలు: 46

బడుల్లో శౌచాలయాలు: 94

అంగన్‌వాడీ కేంద్రాల్లో శౌచాలయాలు: 174

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

– బాల్‌రాజ్, డీఆర్‌డీవో(ఏపీడీ)ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరం పాత పనులతో పాటు.. సామాజిక అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం సర్వే చేసి పనులను గుర్తించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. త్వరలో మెటీరియల్ కాంపోనెంట్ కింద పనులు చేయిస్తాం. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

# బాల్యానికి ఆరోగ్య రక్ష

సంగారెడ్డి: చిన్నారులే జాతి సంపద. వీరి సంక్షేమానికి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రాధాన్యం ఇస్తోంది. పోషణలోపంతో సతమతమవుతున్న చిన్నారులు ఇప్పటికీ ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే వారితో పాటు మిగతా చిన్నారులూ.. పోషణలోపంతో బాధపడకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి సంవత్సరం సెప్టెంబరు నెలంతా పోషణ్ అభియాన్ పేరిట మాసోత్సవాన్ని నిర్వహిస్తోంది. నేటి నుంచి కార్యక్రమం ప్రారంభం కానుంది.

కార్యక్రమాలు ఇలా..

ప్రజల్లో పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, వివిధ శాఖల భాగస్వామ్యంతో నెల రోజుల పాటు పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తారు. మొదటి వారంలో ప్రజలతో మమేకమవుతారు. రెండో వారంలో పోషకాహారం ప్రాధాన్యం, అనీమియాకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు. ఇదే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తారు. మూడో వారం శిశువు పుట్టినప్పటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు. నాలుగో వారం చేతుల శుభ్రత, డయేరియా వ్యాధి నివారణకు జాగ్రత్తలు సూచిస్తారు. పర్యావరణం, నూతన సాంకేతిక వినియోగం తదితర అంశాలనూ ఇందులో చేర్చారు.

తల్లిపాలే శిశువుకు రక్ష

తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించనున్నారు. బిడ్డకు సంపూర్ణ



ఆరోగ్యం తల్లిపాల ద్వారా చేకూరుతుంది. పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టడం ద్వారా తల్లీబిడ్డలిద్దరికీ శ్రేయస్కరం. ఆరు నెలల వయసు వరకు తల్లిపాలే పట్టించాలి. వీటిలో సరిపోయే విటమిన్లు, మినరల్స్ సమపాళ్లలో ఉండటం ద్వారా శారీరక, మానసిక వికాసం వేగంగా అభివృద్ధి చెందుతుంది.

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 5

అంగన్‌వాడీ కేంద్రాలు: 1,504

గ్రోత్ మేళాలో పాల్గొన్న చిన్నారులు: 88,824

వయసుకు తగిన బరువు లేనివారు: 10,645

ఎత్తుకు తగిన బరువు లేనివారు: 4,964

వయసుకు తగిన ఎత్తులేనివారు: 17,075

అవగాహనతో మార్పు...-లలితకుమారి, జిల్లా సంక్షేమాధికారిణి

జిల్లా వ్యాప్తంగా పోషణ మాసోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించనున్నాం. వయసుకు తగిన బరువులేని చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.

## మంచి అలవాటే భవితకు ఆలంబన

కుల్కచర్ల: పిల్లలకు విద్యార్థి దశలోనే జీవితానికి ఉపయోగపడే విషయాలనే అలవాటు చేయాలి. తద్వారా భవిష్యత్తులో దాని ప్రభావం కనిపించి ఉన్నతంగా ఎదుగుతారు. ఆరోగ్యవంతమైన అలవాట్లతో మంచి జీవితాన్ని గడుపుతారు. దీనివల్ల సమాజానికీ మేలు జరుగుతుంది. ఇందుకోసం విద్యాశాఖ పలు కార్యక్రమాలు అమలుచేస్తోంది. ఇందులో 'స్వచ్ఛ పక్వాడ' ఒకటి. ఈనెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు అన్ని పాఠశాలల్లోను అమలు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో కథనం.

**పకడ్బందీగా నిరహిస్తేనే ప్రయోజనం**

జిల్లాలో పరిగి, వికారాబాద్, కొడంగల్, తాండూరు నియోజకవర్గాలు, మొత్తం 566 పంచాయతీలుండగా వేయికిపైగా పాఠశాలలున్నాయి. పథకం క్షేత్ర స్థాయిలో అందరికీ చేరాలన్నప్పుడు పటిష్ఠ ప్రణాళికతో ముందుకు వెళ్లాలి. పక్కాగా పర్యవేక్షణ సాగాలి. గతేడాది పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించినా నామమాత్రంగానే సాగిందనే విమర్శలొచ్చాయి. తగిన పర్యవేక్షణ లేకపోవడంతో పాటు పలు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఎక్కువ దృష్టి సారించలేదని తల్లిదండ్రులు పేర్కొన్నారు. తద్వారా పథకం లక్ష్యం నెరవేరలేదు. ఈసారి ఆ విధంగా కాకుండా అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు



విజయవంతానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది.

**ఇవీ కార్యక్రమాలు**

1న విద్యార్థులతో కలిసి స్వచ్ఛ పక్వాడపై ప్రతిజ్ఞ చేయడం, 2, 3న పరిశుభ్రతపై అవగాహన, 4, 5న ఆయా గ్రామాల్లో స్థానికులతో మమేకం కావడం, స్వచ్ఛతపై వివరించడం. 6న వన మహోత్సవం సందర్భంగా మొక్కలను నాటడం. 7, 8 తేదీల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల నిర్వహణ, 9,10 చేతులను శుభ్రంగా కడుక్కోవడం, దాని ప్రాధాన్యం వివరించడం. ఇలా.. 15న వివిధ అంశాల్లో పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందించి ప్రోత్సహించడంతో ముగుస్తాయి.

**ప్రత్యేక దృష్టి సారిస్తాం**

– హబీబ్ అహ్మద్, విద్యాధికారి కుల్కచర్ల

స్వచ్ఛపక్వాడ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక దృష్టిని సారిస్తాం. ఇప్పటికే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తగిన సూచనలను అందించాం. కార్యక్రమం వల్ల విద్యార్థులకు మంచితనంతో పాటు సమాజంపై తగిన బాధ్యత కలిగి ఉంటారు.

## వచ్చేస్తోంది.. హలో ఎఫ్‌ఎం..!

భువనగిరి : వినండి.. వినండి.. ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. ఈ పదాలు ఎక్కడో విన్నట్లున్నాయి కదూ.. మనల్ని తెల్లవారుజామునే నిద్ర లేపేందుకు రానుంది ఎఫ్‌ఎం (ఫ్రీక్వెన్సీ మాడ్యులేషన్) రేడియో స్టేషన్. దేశంలోని 234 నగరాలు, పట్టణాల్లో నూతనంగా 730 ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వ మంత్రి వర్గం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఆ జాబితాలో తెలంగాణకు 10 దక్కగా.. అందులో ఉమ్మడి జిల్లా పరిధిలోని నల్గొండ, సూర్యాపేట ప్రాంతాల్లో కొత్త ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లు మంజూరు కావడం గమనార్హం. త్వరలోనే ఈ–వేలం ద్వారా వీటిని ప్రారంభించనున్నట్లుగా తెలుస్తుంది.కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఈ స్టేషన్లు రావడంతో ఉమ్మడి నల్గొండ జిల్లా వాసుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. హైదరాబాద్ దగ్గరగా ఉండటంతో ఇప్పటికే యాదాద్రి జిల్లాలో ఎఫ్‌ఎం రేడియోలో గొంతుకలు అలరిస్తున్నాయి. నూతన అభిరుచిలకు అనుగుణంగా ఎఫ్‌ఎం ఛానెళ్లు కూడా మార్పు చెందడంతో క్రమేణా రేడియో ఎఫ్‌ఎం శ్రోతల సంఖ్య పెరుగుతుంది.

**వినోదంతో పాటు విజ్ఞాన సాధనంగా..**

జిల్లా కేంద్రాల్లో నూతన ఎఫ్‌ఎం రేడియో స్టేషన్ల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు పెరిగే వీలుంటుంది. ఒక్కో స్టేషన్‌కు కనీసం 20 నుంచి 30 మందికి ఉపాధి లభించే ఛాన్స్ ఉంది. ఆయా పట్టణాల్లో జరిగే తాజా సమాచారాన్ని శ్రోతలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది.

వ్యాపార సముదాయాలు, సంఘాలు తమ ఉత్పత్తులు, సేవలను ప్రజలకు చేరవేయడానికి ఎఫ్‌ఎం రేడియోను ఉపయోగించుకోవచ్చు. ప్రత్యేకించి స్థానిక మార్కెట్లకు ఇది ఫలప్రదంగా ఉంటుందంటే



అతిశయోక్తి కాదు.

రేడియో స్టేషన్లలో ప్రకటనల ఖర్చులు తక్కువగా ఉండటంతో చిన్న వ్యాపారులు సైతం వీటిని ఉపయోగించుకునే వీలు ఏర్పడుతుంది. మొత్తంగా నల్గొండ, సూర్యాపేట ప్రాంతాల్లో ప్రారంభం కానున్న నూతన ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లు వినోదం, విజ్ఞానంతో పాటు సమాచార సాధనంగా కూడా ఉపయోగపడే అవకాశం ఏర్పడుతుంది.

స్థానిక అంశాలకు ప్రాధాన్యం..

ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లలో స్థానిక అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రజలకు అవసరమైన విషయాలు, సంస్కృతి సంప్రదాయాలు, సంగీతానికి సంబంధించినవి ప్రసారం చేయడం వల్ల ప్రజలను సమాజానికి దగ్గర చేస్తాయి. రేడియో స్టేషన్లలో కార్యక్రమాలను సమయానికి అనుగుణంగా ప్రసారం చేయవచ్చు. ఉదాహరణకు ఉదయం సమయాన్నే రేడియోలో స్థానిక వార్తాంశాలతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు, మరమ్మతుల కారణంగా నీటి సరఫరా, విద్యుత్తు నిలిపివేత వంటివి ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుంది.

## ఆలయాభివృద్ధికి మోక్షం.. బోర్డు ఏర్పాటు తథ్యం



సిరిసిల్ల: రాష్ట్రంలో అతి సనాతన, సంప్రదాయ శైవక్షేత్రం.. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. విస్తరణ నమూనాలపై శృంగేరి పీఠం అనుమతి తీసుకోవాల్సి ఉంది. దీనికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయ అర్చకులు, ఉన్నతాధికారులతో కలిసి వీటీడీఏ ఛైర్మన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం కలిశారు. బడ్జెట్‌లో కేటాయించిన రూ.50 కోట్లతో చేపట్టబోయే అభివృద్ధిపై ముఖ్యమంత్రికి వివరించారు. దీనికి ముందుగా శృంగేరి పీఠాధిపతి అనుమతి తీసుకోవాల్సి ఉంది. పీఠాధిపతి అనుమతితో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. దాని తర్వాత తితిదే తరహా ఆలయ బోర్డును కూడా ఏర్పాటు చేయనున్నారు.

**శృంగేరి పీఠాధిపతి అనుమతితో..**

రాజన్న ఆలయ ధర్మకర్తల మండలి 2014 వరకు ఉంది. ఆ తరువాతి నుంచి ఉత్సవాల సమయంలో మాత్రం తాత్కాలిక ఆలయ పునరుద్ధరణ కమిటీలు.. ఉత్సవ కమిటీలను నియమిస్తున్నారు. నవంబరు 2022లో దేవాదాయ శాఖ కమిషనర్ ఆలయ ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనికి స్పందించిన అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డిసెంబరు 14న ఉత్తర్వులు జారీ చేశారు. ఆసక్తిగల అర్హులైన వారు ట్రస్టు బోర్డు సభ్యులుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీనికోసం పలువురు ఉత్సాహం చూపించినా ఈ ప్రక్రియ అక్కడితోనే నిలిచిపోయింది. వారం రోజుల్లో శృంగేరి పీఠాధిపతి అనుమతితో ఆలయాభివృద్ధికి బీజం పడనుంది. జిల్లా ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంది.

గత ప్రభుత్వంలో ఆలయాభివృద్ధి పనుల్లో భాగంగా ఆరోఫాం అర్కిటెక్ సంస్థతో నమూనాలు, ఊహా చిత్రాలు సిద్ధం చేశారు. రెండు అభిషేక మండపాలు, నిత్యనివేదన, నిత్య కల్యాణ మండపాలు ఉంటాయి. తూర్పు, పడమర రాజగోపురాలను తొమ్మిది అంతస్తులు, దక్షిణ గోపురం ఏడంతస్తులు, ఉత్తర గోపురం ఐదంతస్తులకు పెంచుతారు.

ఆలయ సమీపంలో ఇప్పుడున్న ధర్మగుండంతోపాటు మరో గుండాన్ని నిర్మించనున్నారు. శివ కల్యాణం, సీతారాముల కల్యాణాలకు రెండు వేర్వేరు మండపాలు నిర్మిస్తారు. ఆలయ సమీపంలో సంస్కృత, వేద ఆగమ, సంగీత నాట్య కళాశాలలు నిర్మించనున్నారు.

ప్రస్తుతం బద్ది పోచమ్మ ఆలయ ప్రహరీ, శివార్చన వేదిక నిర్మాణం, గుడిచెరువు ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి.

మానేరు జలాశయం.. రాజన్న ఆలయ పట్టణాన్ని కలిపి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేలా గతంలోనే ప్రణాళికలు చేశారు. వీటీడీఏతోపాటు ప్రత్యేక నదీతీర అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయాలి. ఆధ్యాత్మిక పర్యాటకంలో భాగంగా రూ.15 కోట్లతో మూలవాగు సమీపంలో కాటేజీలు, రూ.29.50 కోట్లతో నాంపల్లిగుట్టపై రహదారులు, రూప్‌వే, ధ్యాన మందిరం, పార్కులు, కాటేజీల నిర్మాణాలకు ప్రతిపాదనలు చేశారు కానీ.. అవేవీ కార్యరూపం దాల్చలేదు.

శిల్ప కళ ఉట్టిపడేలా.. రాజన్న ఆలయం ప్రస్తుతం 0.24 ఎకరాల్లో ఉంది. ప్రధాన ఆలయాన్ని ముట్టుకోకుండా మహాప్రాకారం అయిదు ఎకరాలకు విస్తరిస్తారు.

వేములవాడ చాళుక్యులు.. కాకతీయుల నిర్మాణ శైలి ప్రస్తుత కట్టడాల్లో కనిపిస్తుంది. కొత్తగా నిర్మించే వాటికి సైతం అప్పటి శిల్ప కళ ఉట్టిపడేలా కృష్ణ శిలలు ఉపయోగిస్తారు.

## ముగుస్తున్న సీనియర్ రెసిడెంట్ల శిక్షణ



గోదావరిఖని : రాష్ట్రవ్యాప్తంగా బోధనాసుపత్రుల్లో వైద్యుల కొరత ఉన్నప్పటికీ సీనియర్ రెసిడెంట్ల సేవలతో కొంతమేరకు ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతున్నాయి. ఈ నేపథ్యంలో వారి ఏడాది గడువు పూర్తికావడంతో ఈనెల 3న వారు విధుల్లోంచి తప్పుకోనున్నారు. దీంతో ఆయా బోధనాసుపత్రుల్లో వైద్య సేవలకు విఘాతం ఏర్పడనుంది. వైద్యవిద్యలో ఎండీ, ఎంఎస్ తదితర పీజీ కోర్సులు పూర్తిచేసిన సీనియర్ రెసిడెంట్లు.. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏడాదికాలం సేవలందించాల్సి ఉంటుంది. గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక(బోధన) ఆసుపత్రిలో 33మంది సీనియర్ రెసిడెంట్లు 3న విధుల్లోంచి తప్పుకోనున్నారు.

**కథ మళ్లీ మొదటికి..**

గోదావరిఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో మొత్తం 57మంది స్మీనియర్ రెసిడెంట్లు పనిచేయాల్సి ఉండగా.. గత ఏడాది కాలంగా కేవలం 33 మంది మాత్రమే ఉన్నారు. సాధారణంగా ఒక శిక్షణ బృందం పూర్తయ్యేలోగా మరో బృందం విధుల్లోకి రావాలి. అయితే కొవిడ్ నేపథ్యంలో పీజీ ప్రవేశాలు, పరీక్షల్లో నెలకొన్న జాప్యంతో ఒక్కో బృందానికి సుమారు ఐదారు నెలలు పడుతుంది. అయితే ఆసక్తి గలవారిని యథావిధిగా కొనసాగించడం.. లేదంటే ఖాళీల ప్రకారంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఒప్పంద విధానంలో నియమించుకునేందుకు ఆయా ఆసుపత్రి వర్గాలు సమాలోచిస్తున్నాయి.

**ముఖాముఖికి స్పందన కరవు**

గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాల, సార్వజనిక ఆసుపత్రిలో ఆచార్యులు, సహ, సహాయక ఆచార్యులు, సీనియర్ రెసిడెంట్లు, ట్యూటర్ల నియామకానికి మూడు రోజులు ముఖాముఖి నిర్వహించారు. అయితే మానవ శరీర నిర్మాణ శాస్త్రం, కమ్యూనిటీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ఫిజియాలజీ తదితర నాన్ క్లీనికల్ విభాగాల్లో ఎవరూ రాలేదు. దీంతో వారికిచ్చే భృతిని మరో రూ.50వేలకు పెంచుతూ ముఖాముఖికి మరో రెండు రోజులు గడువు పెంచారు. వివిధ విభాగాల్లో ఒప్పంద విధానంలో నియామకానికి ప్రకటన జారీ చేయగా.. గత మూడు రోజుల్లో సుమారు 50 మంది హాజరయ్యారు.

భర్తీ అయ్యేలా చూస్తాం

డాక్టర్ హిమబిందుసింగ్, ప్రిన్సిపల్, ప్రభుత్వ వైద్య కళాశాల, గోదావరిఖని

పూర్తిస్థాయిలో వివిధ విభాగాల్లోని పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నాన్ క్లీనికల్ విభాగంలో అభ్యర్థులు ముందుకు రావడం లేదు. వివిధ విభాగాల్లో నిర్వహించిన ముఖాముఖికి సుమారు 50 మంది హాజరుకాగా.. పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేసేలా చర్యలు తీసుకుంటాం.

## కళ్లు మూసుకున్నాం.. కట్టేసుకోండి

హైదరాబాద్ : శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి జాతీయ రహదారిపై కాముని చెరువు నాలాపై నిర్మించిన భారీ భవనం. ఏడేళ్ల క్రితం బహుళ అంతస్తుల భవనం కట్టారు. ఇది నిర్మాణంలో ఉండగా.. కాముని తటాకానికి భారీ వరద రావడం, నాలాలోంచి నీళ్లు ప్రవహించడంతో కింది నుంచి జలం వెళ్లేలా ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో ఉంటున్న మాజీ మంత్రి అనుచరులు ఈ భవనాన్ని నిర్మించారు. శంషాబాద్ మండలంలోని ఊటుపల్లి వద్ద హిమాయత్‌సాగర్‌కు వెళ్లే వరద నాలాపై భారీ భవంతిని కొందరు ప్రైవేటు వ్యక్తులు నిర్మించారు. తొలుత సాధారణ కట్టడాలుండగా.. కొందరు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సహకారంతో భారీ నిర్మాణాన్ని, రక్షణగోడ కట్టారు. తర్వాత నాలా ప్రవాహం వల్ల భవనానికి ఇబ్బందులు కలగకుండా కొంత భాగాన్ని మళ్లించారు.గొలుసుకట్టు చెరువులను కలిపే నాలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. శేరిలింగంపల్లి మండలంలో ఐదు తటాకాలకుఅనుబంధంగా ఉన్న నాలాలు.. శంషాబాద్ మండలంలో 3 నాలాలపై నీటి ప్రవాహానికి అడ్డుగాభారీ నిర్మాణాలు చేపట్టారు. తాజాగా వీటికి కొనసాగింపుగా మరిన్ని జరుగుతున్నాయి.

**నీటివనరులపై నజర్.... :** కొందరు ప్రైవేటు వ్యక్తులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు నీటివనరులపై కన్నేశారు. గొలుసుకట్టు చెరువులు నింపే నాలాలు, ఒక చెరువు నుంచి మరొక తటాకానికి నీళ్లు వెళ్లే నాలాలపై దృష్టి సారించారు. చందానగర్, మియాపూర్,



శేరిలింగంపల్లి, లింగంపల్లి, రాయదుర్గం ప్రాంతాల్లోని నాలాల్లో కొన్నింటిని ఆక్రమించారు.భారీ వర్షం కురిసినప్పుడల్లా అక్కడున్న కాలనీలు ముంపునకు గురవుతున్నాయి.శేరిలింగంపల్లి మండలం మియాపూర్‌లోని మక్తా మహబూబ్‌పేట చెరువుకు సంబంధించిన నాలా. కొన్నేళ్ల నుంచి నీటి ప్రవాహం లేదన్న సాకుతో కొందరు రియల్ వెంచర్ల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు నాలా పరిధిని తగ్గిస్తూ దానిపైనే కట్టడాలను నిర్మిస్తున్నారు. తాజాగా కొందరు ప్రైవేటు వ్యక్తులు రెండు, మూడు వెంచర్లకు రహదారి కోసం కల్వర్టులా నిర్మిస్తున్నారు

## సేంద్రియ సాగే బాగు

గజ్వేల్ : సాగులో రసాయన ఎరువుల వినియోగం రోజురోజుకు పెరిగిపోతోంది. రెండు బస్తాల ఎరువులు ఎక్కువ వేస్తేనే అధిక దిగుబడి వస్తుందన్న నమ్మకం ఏర్పడటంతో రైతులు వ్యయాల కోర్చి ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో ఏ ఆహారపదార్థం తిన్నా రసాయనమయంగా మారిపోతుంది. పంటల సాగులో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులను రైతుల దరి చేర్చడంలో అధికార యంత్రాంగం, పాలకుల శ్రద్ధ చూపకపోవడం పెద్ద లోటుగా కనిపిస్తోంది. ఇప్పటికీ రైతులు భూసారం పరీక్షలపై ఆధారపడకుండా ఎరువులను వినియోగిస్తున్నారు. అధిక ఎరువుల వినియోగం వల్ల భూముల్లో సూక్ష్మ పోషకాల సమతుల్యం దెబ్బతిని నేలలు పాడవటంతో పాటు పంటల దిగుబడి పడిపోయి.. రైతులకు నష్టాలు ఎదురయ్యే పరిస్థితులు నెలకొంటాయి.

శ్రద్ధ లేక రైతులను ప్రోత్సహించి సేంద్రియ సాగు వైపు మళ్లిస్తే ఆరోగ్యకరమైన పంటలు పండించేందుకు వీలుంటుంది. సాగు ఖర్చులు కూడా తగ్గే అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతో కేంద్రం కొన్నాళ్ల పాటు



సేంద్రియ సాగును ప్రోత్సహించింది. పీకేవీవై పథకం ద్వారా జిల్లాలో ఐదేళ్ల కిందట ఎంపిక చేసిన పలు గ్రామాల్లో ప్రయోగాత్మకంగా దాదాపు రూ.86లక్షల వ్యయంతో సేంద్రియ పంటలు సాగు చేశారు. దిగుబడులు ఆశాజనకంగా రావటంతో ఉత్పత్తులపై జిల్లా అంతట విస్తృత ప్రచారం జరిగింది. ఈ పంటలను విక్రయించుకునేందుకు ప్రభుత్వం గజ్వేల్, సిద్దిపేట రైతు విపణుల్లో ప్రత్యేక స్టాళ్లను కూడా కేటాయించింది. మూడేళ్లుగా కేంద్రం నుంచి నిధులు రాకపోవడంతో మూలనపడిపోయింది. గత సంవత్సరం బడ్జెట్‌లో సేంద్రియ సాగుకు ప్రత్యేక కేటాయింపులు చేస్తామన్న కేంద్రం ప్రకటన జిల్లా రైతుల్లో సంతోషాన్ని నింపింది. తరువాత నిధుల విడుదల కాలేదు. ఏట పచ్చిరొట్ట విత్తనాలు కూడా సరిపడా రావటం లేదని, దీంతో ఏం చేయలేక రసాయన ఎరువులు వినియోగిస్తున్నామని రైతులు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం: రాధిక, డీఏవో

రసాయన ఎరువులు తగ్గించి.. సేంద్రియ విధానంతో పంటలు పండించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మట్టి నమూనాలను ఏటా పరీక్షించి.. సూక్ష్మ లోపాలకు తగ్గట్టుగా సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచేలా కృషి చేస్తాం.

## అతివలకు రుణ సాయం

గజ్వేల్ : స్వశక్తి మహిళా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తోంది. వీటిని సద్వినియోగం చేసుకుంటూ మహిళా సంఘాల సభ్యులు చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. ప్రతి నెలా రుణ వాయిదాలను బ్యాంకుల్లో చెల్లిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సిద్దిపేట జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో 4,168 మహిళా సంఘాలు ఉండగా.. ఈ ఆర్థిక సంవత్సరం 653 సంఘాలకు రూ.66.13కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు.



పనితీరు ఆధారంగా స్వశక్తి సంఘాల సభ్యులు ప్రతి నెలా కొంత మొత్తాన్ని బ్యాంకులో పొదుపు చేస్తుంటారు. సంఘాల పనితీరు, పొదుపు ఆధారంగా బ్యాంకులు రుణాలు అందిస్తాయి. ప్రతి సంఘానికి వారి అవసరం మేరకు అర్హత ఆధారంగా రూ.లక్ష నుంచి గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తున్నారు. వీటిని పొందిన సభ్యులు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో పెట్టుబడి పెట్టి వ్యాపారం చేస్తూ ఆర్థికంగా ముందుకు సాగుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి: హనుమంత్ రెడ్డి, మెప్మా పీడీ

మహిళా సంఘాల సభ్యులు రుణాలు సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలి. వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించి ఆర్థిక చేయూతనిచ్చేందుకు ఎప్పుడూ ముందుంటాం. బ్యాంకు అధికారుల సహకారంతో లక్ష్యాన్ని త్వరలో చేరుకుంటాం.

## జిల్లాకు ఎల్లో అలర్ట్

సంగారెడ్డి : జిల్లాలో ఎడతెరిపి లేకుండా ముసురు జల్లులు కురుస్తున్నాయి. రహదారులు జలమయం కావడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. పుల్కల్ మండలం లక్ష్మీసాగర్‌లో 20 మిల్లీ మీటర్లు, చౌటకూరులో 17.8 మి.మీ. వర్షపాతం నమోదయింది. రానున్న 48 గంటల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు ప్రకటించారు. 'ఎల్లో అలర్ట్' జారీ చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులుంటే 08455–276155కు సమాచారం ఇవ్వాలని సూచించారు. 24 గంటలూ కంట్రోల్ రూం పని చేస్తుందని వివరించారు. వర్షం వల్ల సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లిలో పలుసార్లు విద్యుత్తు అంతరాయం ఏర్పడింది. జహీరాబాద్ మండలం కొత్తూర్ శివారులోని నారింజ ప్రాజెక్టు నిండు కుండను తలపిస్తోంది. ప్రాజెక్టు సామర్థ్యం 85 ఎంసీఎఫ్‌టీలు కాగా.. పూర్తిగా నిండింది. గేట్ల మీదుగా వరద వృథాగా కిందకి ప్రవహిస్తోంది. జహీరాబాద్ బస్టాండ్ గుంతలమయం జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నారాయణఖేడ్, జహీరాబాద్ డివిజన్లలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఇబ్బందులు ఎదురైతే వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 11 చెరువులు మత్తడి దూకినట్లు ప్రకటించారు.

# పేదలకు ఆహార భద్రత ఏదీ!

పెద్దపల్లి : ఆహార భద్రత కార్డుల మంజూరు లేక పేదలకు నిరాశే మిగిలింది. ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ప్రజాపాలనలో దరఖాస్తులకు మోక్షం లభించడం లేదు. రెక్కాడితే డొక్కాడని కుటుంబాల్లోని పేదలకు నిత్యావసర సరుకులు కలగా మారాయి. పాలకులు అదిగో, ఇదిగో ఇస్తామంటూ ఆశలు రేకెత్తించినా అనుమతి లేకపోవడంతో ఎదురుచూపులు తప్పడంలేదు. ఇటీవల పాత కార్డుల సవరణల కోసం మీసేవలో అవకాశం కల్పించినప్పటికీ దీనిపై అధికారులకు స్పష్టత లేకపోవడంతో లబ్ధిదారులు వెనుదిరుగుతున్నారు.

**అపరిష్కృత దరఖాస్తులు**

మూడేళ్లుగా రేషన్ కార్డుల సవరణ నిలిచిపోయింది. ఉమ్మడి జిల్లాలో 11,840 కార్డుల్లో 39,095 మంది వినియోగదారులు (సభ్యులు) దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో ఇప్పటి వరకు 6,846 దరఖాస్తులను గిర్దావర్, తహసీల్దార్, జిల్లా పౌరసరఫరాల అధికారి వారి పరిధిలో ఆన్‌లైన్‌లో అనుమతిచ్చి ప్రభుత్వానికి నివేదించారు. పలు కారణాలతో 463 తిరస్కరించారు. 4,526 దరఖాస్తులు పెండింగ్‌లో మగ్గుతున్నాయి. అర్హులైనప్పటికీ అధికారులు విచారణలో తొలగించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**అనుమతి లేక నిరాకరణ**

ఇటీవల మీసేవలో రేషన్ కార్డు కలిగి ఉండి అందులో పేరు, ఇంటి పేరు, ఆధార్ కార్డుల్లో తప్పొప్పులు, కొత్తగా వివాహమైన వారు సవరణ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్నా ఫలితంలేదు. సంబంధిత



అధికారుల నుంచి ఆదేశాలు లేకపోవడంతో మీసేవ నిర్వాహకులు ఆన్‌లైన్‌లో చేయడంలేదు.

**ఎన్నాళ్లో ఎదురుచూపులు**

కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్‌కార్డులపై పేదలు ఆశలు పెట్టుకున్నారు.

కార్డు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఆరోగ్యశ్రీలో రేషన్‌కార్డు లేకున్నా వైద్య సేవలు పొందడంపై ఇంకా స్పష్టత రాలేదు. పెళ్లి చేసుకుని తల్లిదండ్రుల కార్డు నుంచి తొలగించిన కుమారుడి కుటుంబానికి నేటికీ మంజూరు కాలేదు.

తప్పుల సవరణ చేసే అవకాశం నిలిచిపోవడంతో కార్డు ఉన్నా సరుకులు పొందడం లేదు.

**ఆదేశాలు రావాల్సి ఉంది**

కొత్త రేషన్‌కార్డుల మంజూరు కోసం ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేవు. సవరణకు కూడా అనుమతి ఇవ్వలేదు. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తేనే మీసేవలో దరఖాస్తు చేసుకోవాలి.

ప్రేమ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి

**ఆరేళ్లుగా ఎదురుచూస్తున్నా**

నాకు పెళ్లై కొడుకు, కూతురు ఉన్నారు. ఆరేళ్లుగా రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్నా. ప్రజాపాలనలో దరఖాస్తు చేశా. రేషన్ సరుకులు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నా.

సయ్యద్ రిజ్వానుద్దీన్, పెద్దపల్లి పట్టణం

# కంప్యూటర్ విద్య.. అందని ద్రాక్ష

మెట్‌పల్లి: ప్రస్తుతం కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా మారింది. పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చిన్నతనం నుంచే కంప్యూటర్ విద్యపై అవగాహన పెంపొందించాల్సిన ఆవశ్యకత ఉంది. దీన్ని గుర్తించిన విద్యాశాఖ కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి విద్యార్థుల సంఖ్య ఆధారంగా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో కంప్యూటర్లు, ఇతర పరికరాలను సరఫరా చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా కంప్యూటర్ పాఠాలు చెప్పేవారిని నియమించకపోవడంతో ఆశించిన ఫలితం నెరవేరడం లేదు.జిల్లాలో మొత్తం 768 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. గతంలో సక్సెస్ పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందించాలని ప్రభుత్వం నిర్ణయించి కంప్యూటర్లను పంపిణీ చేశారు. తాత్కాలిక ప్రాతిపదికన శిక్షకులను నియమించగా విద్యార్థులకు కంప్యూటర్ విద్య నేర్పించారు. కొన్నేళ్లకు బోధకులతో ఒప్పంద కాలపరిమితి ముగియడం మళ్లీ నియమించకపోవడంతో కంప్యూటర్ విద్య దారి తప్పింది. కంప్యూటర్లు వినియోగించక ఆయా పాఠశాలల్లో మూలనపడ్డాయి. ఇటీవల వాటిని పాఠశాలల నుంచి తిరిగి వెనక్కి తీసుకున్నారు. చాలా ఏళ్ల తర్వాత ప్రభుత్వం విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందించడంపై దృష్టిసారించింది. కొత్తగా కేజీబీవీ, ఉన్నత,



గురుకుల పాఠశాలలను ఎంపిక చేసి విద్యార్థుల సంఖ్య ఆధారంగా కంప్యూటర్లను సరఫరా చేసింది. వందలోపు విద్యార్థులు ఉన్న చోట ఒకటి, రెండొందలలోపు ఉన్న పాఠశాలలకు ఎనిమిది, ఆ పైన ఉన్న బడులకు పది చొప్పున కంప్యూటర్లు, యూపీఎస్‌లు అందజేశారు. జిల్లాలో బీర్పూర్ మండలంలో 2, భీమారంలో 1, బుగ్గారంలో 4, ధర్మపురిలో 6, ఎండపల్లిలో 4, గొల్లపల్లిలో 5, ఇబ్రహీంపట్నంలో 5, జగిత్యాలలో 3, జగిత్యాల రూరల్‌లో 10, కథలాపూర్‌లో 6, కొడిమ్యాలలో 6, కోరుట్లలో 8, మల్లాపూర్‌లో 10, మల్యాలలో 2, మేడిపల్లిలో 6, మెట్‌పల్లిలో 5, పెగడపల్లిలో 1, రాయికల్‌లో 4, సారంగాపూర్‌లో 3, వెల్గటూర్ మండలంలో 2 పాఠశాలలకు సరఫరా చేశారు.

**బోధకులను నియమిస్తేనే..**పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందజేసేందుకు పరికరాలను అందించిన ప్రభుత్వం బోధకులను నియమించలేదు. దీంతో ప్రస్తుతం అవి వృథాగానే ఉన్నాయి. కంప్యూటర్లలో సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేయలేదని తెలుస్తోంది. గతంలో జరిగిన విధంగా కాకుండా కంప్యూటర్ విద్య అందేలా చర్యలు తీసుకుంటేనే విద్యార్థులకు మేలు చేకూరుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. విద్యాశాఖ ఉన్నతాధికారులు కంప్యూటర్ విద్య బోధకులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# హోదా పెరిగి ఆరేళ్లు..
# ఖాళీల భర్తీకి ఎన్నేళ్లో..



పరిగి: జిల్లాలో దశాబ్దాలుగా తాండూరు, వికారాబాద్ మున్సిపాలిటీలు అందరికీ సుపరిచితం. తెలంగాణ ఆవిర్భావం, తరువాత కొత్త జిల్లాలు, మున్సిపాలిటీలపై గత ప్రభుత్వం దృష్టి సారించింది. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని మేజర్ పంచాయతీలను మున్సిపాలిటీగా మార్చిన సర్కారు అవసరమైన పోస్టులను భర్తీ చేయడం లేదు. ఏళ్ల తరబడి ఇదే విధంగా కొనసాగడంతో అభివృద్ధి పనులపై ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం పడుతోంది. కొత్త పురపాలికలలో గతంలో కంటే నిధులు సమకూరుతున్నా ఆశించిన స్థాయిలో ప్రగతి పనులు కనిపించడం లేదనే విమర్శలున్నాయి. పనులను పర్యవేక్షించే అధికారులు లేకుండా పోయారు. ఉన్నవారితోనే కాలం గడపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పరిశీలన, తనిఖీలకు వస్తున్న సందర్భాల్లో ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను పాలకవర్గం తీసుకువెళ్తున్నా ఎలాంటి మార్పు కనిపించడం లేదు. ప్రధానంగా అంతర్గతర రహదారులు, పారిశుద్ధ్య సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు.

**ఇదీ పరిస్థితి:** 2018 జూన్ 2న మేజర్ పంచాయతీ స్థితి నుంచి పరిగి, కొడంగల్ పట్టణాలను మున్సిపాలిటీలుగా హోదా పెంచారు. 12 వార్డులు, 14,068 జనాభాతో కొడంగల్ పురపాలికగా ఏర్పడితే, పరిగి 20.7 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, 15 వార్డులు, 18,242 జనాభాతో ఏర్పడింది. రెండు చోట్లా ఆరేళ్లుగా అధికారుల కొరత పట్టి పీడిస్తోంది. పరిగిలో దాదాపు 40కిపైగా కాలనీలు, కొడంగల్‌లో 20కిపైగా ఏర్పాటయ్యాయి. ఇంకా కొత్తవి నిర్మాణంలో ఉన్నాయి.

**ఖాళీలు ఇలా..:** కమిషనర్, మేనేజర్ డిప్యుటేషన్‌పై పనిచేస్తుండగా పర్యావరణ శాఖ అధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఏఈతో పాటు ఇతర పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది లేకపోవడంతో ప్రగతి పనులకు ప్రతిబంధకంగా మారింది. డిప్యుటేషన్లపై పనిచేస్తున్న వారికి ఇతర రెండు మూడు మున్సిపాలిటీల బాధ్యలను నిర్వరిస్తున్నారు. దీంతో వారు ఎటూ న్యాయం చేయలేకపోతున్నారు.

**రూ.కోట్ల పనులు పర్యవేక్షణ శూన్యం**

పాత మార్కెట్ యార్డులో సుమారు రూ. 4 కోట్ల అంచనా వ్యయంతో సమీకృత వాణిజ్య భవన సముదాయం నిర్మిస్తున్నారు. ఇది పునాది స్థాయిలోనే బీటలు వారింది. రెండేళ్ల క్రితం సుమారు రూ. 15కోట్ల వ్యయంతో సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులు చేపట్టారు. పట్టణానికి మంచినీరు అందించే పైప్‌లైన్లు సీసీ రోడ్ల కింద నుంచి వెళ్లాయి. అవి దెబ్బతిన్నప్పుడల్లా రోడ్లను తవ్వడంతో రెండు విధాలుగా నష్టం జరుగుతోంది. ఎనిమిది నెలల క్రితం రూ. 25కోట్ల అంచనాతో పలు అభివృద్ధి పనులకు మళ్లీ ప్రతిపాదనలు పంపారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిన మరో ఏడుగురు పనిచేస్తున్నారు.

**భర్తీ చేయాలని కోరాం - అశోక్‌కుమార్, ఛైర్మన్ మున్సిపాలిటీ**

మున్సిపల్ పరిధిలో పోస్టులు భర్తీ చేయాలని గతంలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. ఇప్పటివరకు భర్తీ కాలేదు. మరోసారి సంబంధిత మంత్రి దృష్టికి తీసుకువెళ్తాం. అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడా ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

# సామాజిక సేవ.. మరిచారా!




తాండూరు : సహజ వనరుల్ని ఉపయోగించుకుని లాభాలు గడిస్తున్న కర్మాగారాలు ప్రభావిత గ్రామాల్లో సేవా కార్యక్రమాల్ని చేపట్టాలి. ఇందుకోసమే ప్రభుత్వం 'సామాజిక బాధ్యత (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ..సీఎస్ఆర్)'ను అమలుచేస్తోంది. దీనికింద పల్లెలను ప్రగతి బాట పట్టిస్తామంటూ యాజమాన్యాలు గ్రామాల దత్తతను దస్త్రాలకే పరిమితం చేస్తున్నాయి. జిల్లాలో వ్యాపార కేంద్రమైన తాండూరులో అటకెక్కిన కర్మాగారాల సామాజిక బాధ్యతపై కథనం.

జాతీయ స్థాయి భారీ సిమెంటు పరిశ్రమల ఏర్పాటు: జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన భారీ పరిశ్రమలు తాండూరు మండలంలో కొలువుతీరాయి. కరణ్‌కోటలో కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలో సిమెంటు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నిర్వహిస్తున్నారు. బెల్కటూరులో పెన్నా సిమెంట్స్ కర్మాగారం, మల్కాపూర్‌లో ఇండియా సిమెంట్స్ (ఐసీఎల్) నెలకొల్పారు. ఓగీపూర్ సరిహద్దులో వికాట్ కలుబుర్గి సిమెంటు కర్మాగారాన్ని, సంగెంకలాన్ శివారులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చెట్టినాడ్ సిమెంటు కర్మాగారం నిర్మించారు.

వేయికిపైగా నాపరాయి భూముల సేకరణ: సిమెంటు తయారీలో వినియోగించే సున్నపురాయిని పొందేందుకు మండలంలోని వందల సంఖ్యలో రైతుల నుంచి వెయ్యికిపైగా ఎకరాల్లో భూములు సేకరించారు. ఇక్కడి కాగ్నా నది నుంచి నీటిని వినియోగిస్తున్నారు. ఉత్పత్తుల ఎగుమతులకు, ముడిసరకు దిగుమతులకు ప్రతిరోజు 3వేలకుపైగా లారీలు, ట్యాంకర్లు, టిప్పర్లు గ్రామీణ రహదారుల మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక్కడి వనరుల్ని ఉపయోగిస్తున్న యాజమాన్యాలు ఏటా రూ.వందల కోట్లు లాభాలు ఆర్జిస్తున్నారు.

**మూడేళ్లుగా ఆ మాటే లేదు**

మల్కాపూర్, చంద్రవంచ, చిట్టిగణాపూర్, బెల్కటూరు, కరణ్‌కోట, ఓగీపూర్, సంగెంకలాన్‌లను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామని ప్రకటించాయి. మూడు సంవత్సరాలుగా సామాజిక కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నాయి. ఈ విషయమై కంపెనీ యాజమాన్యాలను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తే చేపడతామని దాటవేస్తున్నాయి. ఇప్పటికైనా కర్మాగారాలు సీఎస్ఆర్ పథకం కింద గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

**ఆరంభంలో ప్రత్యేక ఉత్సాహం**

కర్మాగారాల ప్రభావిత గ్రామాల్లో యాజమాన్యాలు సామాజిక బాధ్యత కింద సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎనిమిది సంవత్సరాల క్రితం సీఎస్ఆర్ పథకాన్ని అమలులోకి తెచ్చింది. కర్మాగార లాభాల్లో 2 శాతం సొమ్ముతో ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఖరారు చేసింది. తొలుత పల్లెల్లో ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలతో మందులు, కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సలు వంటి సేవలను ఉచితంగా అందించాయి. మహిళల ఉపాధికి ఉచితంగా కుట్టు శిక్షణ కేంద్రాల్ని నిర్వహించాయి. దివ్యాంగులకు ఉచితంగా వినికిడి పరికరాలు, విద్యార్థులకు పుస్తక సంచుల్ని అందించాయి. ఆలయాల నిర్మాణం, ఆధునీకరణకు, బడుల్లో శౌచాలయాలు, రహదారుల నిర్మాణానికి ఆర్థికసాయం అందించాయి. కాలుష్య నివారణలో భాగంగా ఏటా వేల సంఖ్యలో మొక్కలు నాటి పచ్చదనంలో భాగస్వాములయ్యాయి.

# వెంచర్ వేద్దాం.. ప్రవాహాన్ని తిప్పేద్దాం..

హైదరాబాద్ : శంషాబాద్ కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతుండడంతో అంతేవేగంగా అక్రమార్కులు జలవనరులను కబ్జా చేస్తున్నారు. శంషాబాద్ బాహ్యవలయ రహదారికి 10 కిలోమీటర్ల దూరంలో కౌల్‌బౌల్ దొడ్డి గ్రామం వద్ద ప్రైవేటు పట్టా భూముల్లో రియల్ వెంచర్లు వేసేందుకు వీలుగా ఆ భూములకు సమీపంలో ప్రవహిస్తున్న ఈసీ వాగు ప్రవాహాన్ని మళ్లించారు. భారీ వర్షం కురిస్తే వెంచర్ కోసం నిర్మించిన నిర్మాణాలన్నీ కొట్టుకుపోయే అవకాశాలున్నాయని తెలిసినా అలాగే నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఈసీ వాగు ప్రవాహాన్ని అడ్డుకుంటున్నా.. నిర్మాణాలు చేపట్టేందుకు వేగంగా చర్యలు చేపడుతున్నా..ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. రియల్టర్లు నిర్మించిన ప్రహరీ కారణంగా వరద తమ గ్రామాలను ముంచెత్తనుందని కౌల్‌బౌల్‌దొడ్డి, అమ్దాపూర్ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంచెమడుగు కల్వర్టు కోత.. వికారాబాద్ జిల్లాలో పుట్టిన ఈసీవాగు వికారాబాద్, చేవెళ్ల శంషాబాద్ మీదుగా హిమాయత్‌సాగర్‌లో కలుస్తుంది. సమీపంలోని కేబీదొడ్డి, అమ్దాపూర్ గ్రామాలకు సమీపంలో వెళ్తుండడంతో వర్షాకాలంలో ప్రవాహం గ్రామాల్లోకి వస్తోంది. దీని నివారణకు ర.భ.శాఖ 30 అడుగుల వెడల్పున కల్వర్టును నిర్మిస్తోంది. దీన్ని కొందరు అనుకూలంగా మలచుకున్నారు. 10 అడుగులు మాత్రమే ఉండేలా అధికారులపై ఒత్తిడి తెచ్చారు. వారు చెప్పినట్లే అధికారులు కల్వర్టును నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మట్టికట్టలు వేస్తుండడంతో వాగు ప్రవాహం గ్రామాల వైపు మళ్లనుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదులు చేస్తున్నా స్పందించరు.. వాగులో వెలుస్తున్న అక్రమ వెంచర్ పనులకు అడ్డుకట్ట వేయాలని పలుమార్లు గ్రామస్థులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్కడ జరుగుతున్న పనులను ఫొటోలు తీసి చూపించారు. అక్కడ ప్రైవేటు పట్టా భూములున్నాయని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. ఈసీ వాగు ప్రవాహాన్ని అడ్డుకుంటున్నారా ? లేదా ? అన్న అంశంపై సర్వే నిర్వహిస్తామని చెబుతున్నారు. కొన్ని రోజుల కిందట గ్రామస్థుల ఒత్తిడితో ఇరిగేషన్ అధికారులు వెంచర్ పనులను పరిశీలించినా పనులను అడ్డుకోకపోవడం గమనార్హం.

# విజ్ఞానం వికసించేలా...

వెల్గటూరు: నూతన జాతీయ విద్యావిధానం అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా పాఠశాలల్లో సోమవారం నుంచి 'శిక్షా సప్తాహ్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడానికి సమగ్ర శిక్ష ద్వారా ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నెల 22 నుంచి 29 వరకు రోజువారీగా ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ వెలువడింది. విద్యార్థులు సర్వతో ముఖాభివృద్ధి చెందేలా ఒక్కోరోజు ఒక్కో ప్రత్యేకాంశంపై కార్యక్రమాలు చేపట్టాలని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోషకులు, సమాజంలోని ప్రభావ వర్గాలు ఇందులో భాగస్వాములయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారులతో పాటు నోడల్ అధికారులు, పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు తమ తమ స్థాయుల్లో పర్యవేక్షించి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



**విద్యార్థుల స్థాయిని బట్టి కార్యక్రమాల నిర్వహణ**

అన్ని పాఠశాలల్లో విద్యార్థుల స్థాయిని బట్టి కార్యక్రమాల రూపకల్పన చేశారు. 3-8 ఏళ్ల చిన్నారులకు 1,2 తరగతుల స్థాయిలో, 3-5, 6-10, 11-12 తరగతుల వారీగా విభజించారు. నిర్వహణకు సంబంధించి జియో ట్యాగింగ్‌తో కూడిన ఫొటోలు, వీడియోలను రోజువారీగా విద్యాంజలి పోర్టల్‌లో నిక్షిప్తం చేయాలని అధికారులు సూచించారు. జిల్లా స్థాయిలో ఈ నెల 24, 25న రెండు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

**రోజు వారీగా..**

22న బోధనోపకరణాల దినోత్సవం, 23 తొలిమెట్టు (ఎఫ్ఎల్ఎన్), 24 క్రీడా దినోత్సవం, 25 సాంస్కృతిక దినోత్సవం, 26 నైపుణ్య, డిజిటల్ కార్యక్రమాలు, 27 పర్యావరణ క్లబ్, పోషకాహారం, 29న సామాజిక భాగస్వామ్య దినోత్సవం నిర్వహించాలి.

# పారిశుద్ధ్యం అధ్వానం!

ఎల్లారెడ్డిపేట: ప్రస్తుత వర్షాకాలంలో పల్లెల్లో పారిశుద్ధ్యం లోపిస్తోంది. కాలానుగుణ వ్యాధులు ప్రబలుతుండటంతో ప్రజలు ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. దోమలు, ఈగలు విజృంభించడంతోపాటు పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. అనేక మంది జ్వరాల బారిన పడుతున్నారు. చికిత్స కోసం రూ. వేలు వెచ్చిస్తున్నారు. వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి, పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది. గ్రామాల్లో తిరగాల్సిన ప్రత్యేకాధికారులు పత్తాలేకుండా పోయారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అప్పుడప్పుడు వెళ్లి, గ్రామ పంచాయతీ కార్యాలయాల సందర్శనకే పరిమితమవు తున్నారనే ఆరోపణలున్నాయి.

**కాల్వల్లో పూడిక పేరుకుపోతున్నా...**

జిల్లాలో మొత్తం 255 పంచాయతీలున్నాయి. 13 మండలాలు ఉన్నాయి. మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించారు. అదేవిధంగా గ్రామానికి ఒక అధికారిని పెట్టారు. వీరు మండలాలు, గ్రామాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి. కానీ పట్టించుకోవడం లేదు. పలు మండలాల్లోని గ్రామాల్లో కాల్వల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కాల్వలు పూడికతో నిండిపోయి, ఎక్కడికక్కడే మురుగు నిల్వ ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో చెత్తాచెదారంతో కాల్వలు దర్శనమిస్తున్నాయి. అందులో పందులు స్వైరవిహారం చేస్తుండటంతోపాటు దోమలు, ఈగల బెడద పెరిగిపోయింది. అనేక చోట్ల కాల్వలు శిథిలావస్థకు చేరుకోగా మురుగు రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. తాగు నీరు సరఫరా చేసే పైపులను కాల్వల గుండా వేయడంతో అది కలుషితం అవుతున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అక్కడక్కడ కాల్వల్లో ఉన్న పైపులు పగిలిపోగా అందులోకి మురుగు ప్రవేశిస్తుంది. అపరిశుభ్ర నీటిని తాగుతున్న ప్రజలకు వ్యాధులు సోకుతున్నాయి. తాగునీటి ట్యాంకులను శుభ్రపర్చడం, క్లోరినేషన్ చేయడం వంటి పనులు ఎక్కడా కనిపించడం లేదు. చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు నేరుగా ట్యాంకుల్లోకి వెళ్లి, అక్కడి నుంచి పైపులైన్ ద్వారా ఇళ్లకు సరఫరా అవుతుంది. నెలల తరబడి ట్యాంకులను శుభ్రపర్చకపోవడం వల్ల నాచుపడుతున్నాయి. అపరిశుభ్ర నీటిని తాగుతున్న ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రస్తుత తరుణంలో అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌లో ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న కాల్వ పరిస్థితి ఇది. ఏపుగా గడ్డి పెరిగి కనిపించకుండా ఉంది. నెలల తరబడి సిబ్బంది శుభ్రపర్చకపోవడంతో పూడికతో



నిండిపోయింది. మురుగు వెళ్లే దారిలేక రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ ప్రాంతంలో దోమలు, ఈగలు వృద్ధి చెందుతుండటంతో స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 30 సంవత్సరాలుగా సమస్యకు పరిష్కారం లేదు

నాకు చిన్నపాటి పెంకుటిల్లు ఉంది. 30 సంవత్సరాల కిందట మా ఇంటి లోపలి నుంచి కాల్వ నిర్మించారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగంతా ఇంటిలో నుంచి బయటకు ప్రవహిస్తుంది. కాల్వ నుంచి వేసిన తాగునీటి పైపులైనుకు పూర్తిగా రంధ్రాలు పడ్డాయి. వేరే చోటు నుంచి కాల్వ నిర్మించాలని కోరినా ఫలితం లేదు. చేసేదేమీ లేక కాల్వ వెళ్లే ప్రదేశంలో ఉన్న వంటింటిని పూర్తిగా తొలగించాం.

తిరుపతి, రాచర్ల బొప్పాపూర్

**ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నాం**

కాలానుగుణ వ్యాధుల పట్ల ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నాం. పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. జిల్లాలో వ్యాధులు ప్రబలుతున్నట్లు మా దృష్టికి రాలేదు. మల్టీపర్పస్ వర్కర్స్ ద్వారా కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నాం. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తినట్లు మా దృష్టికి వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం.వీర బుచ్చయ్య, జిల్లా పంచాయతీ అధికారి




## కష్టాల్లో ఉన్నది మన కుటుంబమే: సీఎం చంద్రబాబు

అమరావతి: వరద సహాయక చర్యల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిమగ్నమైంది. సీఎం చంద్రబాబు, మంత్రులు, ఉన్నతాధికారులు అంతా సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ఎక్కడ ఎవరికి ఎలాంటి ఇబ్బంది వాటిల్లొద్దని సీఎం చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు. ఈ రోజు ఉదయం నుంచి జరిగిన ఆహారం పంపిణీ వివరాలను అధికారులను అడిగి సీఎం చంద్రబాబు తెలుసుకున్నారు. 5 హెలీకాప్టర్ల ద్వారా ఆహారం పంపిణీ జరుగుతుందని అధికారులు వివరించారు. హెలికాప్టర్, పడవ, ట్రాక్టర్ల ద్వారా ఉదయం నుంచి ఆహారం, నీళ్లు అందిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.

**హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా ఆహారం :** '5 లక్షల ఆహారం, నీళ్ళ ప్యాకెట్లు సిద్ధం చేసి పంపిణీ జరిగింది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేరుకోలేని చోటకు హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా ఆహారం అందించాలి. మూడు పూటలా ఆహారం అందించాలి. విజయవాడలో 36 డివిజన్లలో విధుల్లో ఉన్న అధికారులే ఆహార పంపణీకి బాధ్యత వహించాలి. క్షేత్ర స్థాయిలో ఆహారం అందింది లేనిది నిర్ధారించుకోవాలి. రెండు రోజులు వరదలో చిక్కుకుని ఆహారం, నీరు లేక పోతే ఆ బాధ ఎలా ఉంటుందో అర్థ చేసుకుని అధికారులు పనిచేయాలి. మన కుటుంబమే అలాంటి కష్టంలో ఉందనే ఆలోచనతో పనిచేయాలి. నీరు తగ్గుతున్న ప్రాంతాల్లో పారిశుధ్య పనులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి అని' అధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**సహాయక చర్యల్లో తెలుగు తమ్ముళ్లు :** విజయవాడలో వరద బాధితులకు సహాయక చర్యలను మంత్రి నారా లోకేశ్ పర్యవేక్షిస్తున్నారు. 'ఆరు హెలికాప్టర్ల ద్వారా ఆహారం, త్రాగునీరు సరఫరా. బోట్లు చేరుకోలేని ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా ఆహార సరఫరా. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ విజ్ఞప్తి మేరకు జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీకి ప్రత్యేక హెలికాప్టర్‌లో 2,500 ఆహార పొట్లాలు. విజయవాడ పరిధిలో వరద ముంపునకు గురైన 32 వార్డుల్లో సీనియర్ ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్న సహాయక చర్యలు. మంత్రి లోకేశ్ పిలుపు మేరకు సహాయ చర్యల్లో రాష్ట్రం నలుమూలల నుంచి విజయవాడ చేరుకున్న పార్టీ శ్రేణులు. విజయవాడ డివిజన్ పరిధిలో 70 పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న 14,452 మంది నిరాశ్రయులు. వరద బాధితులకు ఆహారం, మంచి నీరు అందజేస్తున్నాం అని' మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజి వద్ద వరద నీరు వేగంగా తగ్గుతోంది. ప్రస్తుతం వరద ప్రవాహం 8,71,776 క్యూసెక్కులుగా ఉంది.





## ప్రకాశం బ్యారేజీ చరిత్రలోనే ఇది పెద్ద వరద: మంత్రి నిమ్మల

విజయవాడ: ప్రకాశం బ్యారేజీకి వరద తగ్గుముఖం పడుతోందని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. 11 లక్షల నుంచి 8 లక్షల క్యూసెక్కులకు వరద తగ్గిందని వివరించారు. "వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలు ముమ్మరం చేశాం. ప్రతి ఇంటికీ ఆహారం, తాగునీరు, పండ్లు పంపిణీ చేస్తున్నాం. ఆహారం అందలేదని ఫిర్యాదు రాకూడదని సీఎం చెప్పారు. రోడ్లపై బురద తొలగించేందుకు సిబ్బందిని రప్పిస్తున్నాం. పడవలు, ట్రాక్టర్ల ద్వారా ఆహారం పంపిణీ చేస్తున్నాం. ప్రకాశం బ్యారేజీ చరిత్రలోనే ఇంత పెద్ద ఎత్తున వరద రాలేదు. పెద్ద ఎత్తున విపత్తు వచ్చినా సీఎం సూచనలతో ముందుకెళ్తున్నాం. బ్యారేజీ గేట్లను ఢీకొన్న పడవలను వరద తగ్గాక తొలగిస్తాం. భవిష్యత్తులో కరకట్టలను మరింత పటిష్ఠం చేసేలా చర్యలు తీసుకుంటాం" అని మంత్రి చెప్పారు.

## ముంబయి నటి జత్వానీ కట్టడికి జగన్, సజ్జన్ జిందాల్ ప్లాన్ చేశారు: షర్మిల




కడప: కేంద్రంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం కడప స్టీల్‌ప్లాంట్‌పై ఏమాత్రం స్పందన లేకుండా వ్యవహరిస్తోందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తిచేయాలని వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్‌కు ఆమె వినతిపత్రం అందజేశారు. మాజీ సీఎం జగన్ గత ఏడాది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన చేసినా దాని గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. పరిశ్రమ ఏర్పాటుపై కాంగ్రెస్ తరఫున పోరాటం చేస్తామని చెప్పారు. ముంబయి నటి కాదంబరి జత్వానీ వ్యవహారంపైనా షర్మిల స్పందించారు. ఈ విషయంలో జగన్‌పై పలు విమర్శలు చేశారు. ఆమెను ఎలా కట్టడి చేయాలో జగన్, సజ్జన్ జిందాల్ ప్లాన్ చేశారని ఆరోపించారు.

**అక్రమంగా నిర్బంధించి ఆమెను తొక్కి పడేశారు :** "సజ్జన్ జిందాల్, జగన్ మధ్య సాన్నిహిత్యాన్ని గొప్పగా చెప్పుకొన్నారు. జిందాల్‌కు ఎందుకు ఇన్ని కోట్లరూపాయల ఆస్తి కట్టబెట్టారో జగన్ సమాధానం చెప్పాలి. కాదంబరి జత్వానీ ఓ మహిళ యాక్టర్. ఆమెను మానసికంగా వేధించారు. ఒక మహిళను అడ్డుకునేందుకు ఇంత నీచంగా మారాలా?యాక్టింగ్ ఫీల్డ్‌లోకి వచ్చి ఎదగాలని భావించిన మహిళను మానసికంగా వేధించారు. కేసు పెట్టబోతే అక్రమంగా నిర్బంధించి తొక్కి పడేశారు. ఉన్నతమైన కుటుంబం నుంచి వచ్చిన మహిళను ఇక్కడికి తీసుకొచ్చి అరెస్ట్ చేయడం దుర్మార్గం. జగన్‌కు తెలియకుండానే అప్పటి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు వ్యవహరిస్తారా? ఇద్దరు కుమార్తెలున్న జగన్.. జత్వానీకి జరిగిన అన్యాయంపై ఎందుకు ఆలోచించలేదు? ఈ వ్యవహారంపై ఆయన సమాధానం చెప్పాలి. ఆమెకు అండగా ఉండి పోరాటం చేసేందుకు నేను సిద్ధం.

**గుడ్లవల్లేరు ఘటన.. ఫేక్ అని తేలింది :** గుడ్లవల్లేరు కళాశాలలో హిడెన్ కెమెరాల ఘటన ఫేక్ న్యూస్ అని భావిస్తున్నాం. 300 కెమెరాలు పెట్టారని చెబుతున్నా.. ఎందుకు బయట పెట్టలేదు? ఒకవేళ షవర్‌లో పెట్టి ఉంటే నీళ్లు పడితే బ్లర్ అవుతుంది. కాంగ్రెస్ పార్టీ తరఫున మా టీమ్స్ వెళ్లి సర్వే చేస్తే అంతా ఫేక్ అని తేలింది.

ఒకవేళ కెమెరాలు పెట్టినట్లు ఎవరైనా నిజాలు బయటికి తీస్తే బాధితుల తరఫున పోరాడతా" అని షర్మిల అన్నారు.

## నారా లోకేష్ పర్యవేక్షణలో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు




అమరావతి: విజయవాడను పెద్ద ఎత్తున వరద ముంచెత్తిన విషయం తెలిసిందే. ఏకంగా సీఎం చంద్రబాబు సహా మంత్రులు, అధికారులు అంతా విజయవాడలోనే తిష్ట వేసి మరీ వరద సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. బాధితులకు ఎప్పటికప్పుడు ధైర్యం చెబుతున్నారు. బాధితులకు మూడు పూటలా భోజనంతో పాటు వాటర్ సదుపాయం కల్పిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపి మరీ సహాయక చర్యలు బాధితులకు అందేలా చూస్తున్నారు. మరోవైపు మంత్రి నారా లోకేష్ పర్యవేక్షణలో విజయవాడ వరద బాధితులకు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈరోజు సహాయక చర్యల్లో ఆరు హెలికాప్టర్లు ద్వారా ఆహారం, తాగు నీటిని సరఫరా చేశారు. బోట్లు చేరుకోలేని ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా ఆహార సరఫరా చేస్తున్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ విజ్ఞప్తి మేరకు జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీకి ప్రత్యేక హెలికాప్టర్‌లో 2,500 ఆహార పొట్లాలను చేరవేస్తున్నారు. విజయవాడ పరిధిలో వరద ముంపునకు గురైన 32 వార్డుల్లో సీనియర్ ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంత్రి లోకేష్ పిలుపు మేరకు సహాయ చర్యల్లో రాష్ట్రం నలుమూలల నుంచి విజయవాడకు పార్టీ శ్రేణులు చేరుకున్నాయి. విజయవాడ డివిజన్ పరిధిలో 70 పునరావాస కేంద్రాల్లో 14,452 మంది నిరాశ్రయులు ఆశ్రయం పొందుతున్నారు. ప్రకాశం బ్యారేజి వద్ద వేగంగా వరద తగ్గుముఖం పడుతోంది. ప్రస్తుత వరద ప్రవాహం 8,71,776 క్యూసెక్కులకు చేరుకుంది. మరోవైపు రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద పరిస్థితులు, బాధితులకు అందుతున్న ఆహారం గురించి ఆరా తీశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. తాగునీరు, ఆహారం ప్రతి ఒక్కరికి చేరాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న సహాయక చర్యల్లో కార్యకర్తలు పాల్గొనాలని సూచించారు. ఇప్పటికే మచిలీపట్నం నుంచి విజయవాడకు టీడీపీ కార్యకర్తలు చేరుకున్నారు. బాధితులకు అండగా నిలవాలని, భరోసా కల్పించాలని కార్యకర్తలందరికీ కొల్లు రవీంద్ర సూచించారు.




## భారత్ వ్యతిరేకితో యూనస్ సమావేశం.. ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతున్న దృశ్యాలు

ఢాకా: బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్.. అతివాద సంస్థ హెఫాజత్-ఎ-ఇస్లాం నాయకుడు మమునుల్ హక్, అతని గ్రూప్ సభ్యులతో సమావేశమయ్యారు. దీనికి సంబంధించిన దృశ్యాలు ఆన్‌లైన్‌లో వెలుగులోకి వచ్చాయి. మమునుల్ హక్.. రెచ్చగొట్టే ప్రకటనలు చేయడంతో పాటు భారత వ్యతిరేక వైఖరిని అనుసరిస్తుంటారు. అలాంటి నేతతో యూనస్ సమావేశం కావడం, ఎన్నికల గురించి చర్చించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల బంగ్లా రాజధాని ఢాకాలో ఈ సమావేశం జరిగింది. హింసను ప్రేరేపిస్తున్నారన్న ఆరోపణలతో పలు అభియోగాల కింద మనుముల్ హక్‌ను మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వం జైలులో బంధించింది. అయితే రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలతో ఆమె ఇటీవల గద్దె దిగాల్సి వచ్చింది. ప్రస్తుతం ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. అనంతరం ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం.. హక్‌తో పాటు పలువురు అతివాద నేతలను విడుదల చేసింది. ఇప్పుడు వారితోనే యూనస్ సమావేశమయ్యారు. ఎన్నికల సంస్కరణలు, సకాలంలో ఎన్నికల నిర్వహణ వంటి అంశాలను వారితో చర్చించారు. ఇదిలాఉంటే.. బంగ్లాదేశ్‌లో భారత్ వ్యతిరేకిగా పేరొందిన మతతత్వ పార్టీ జమాతే ఇస్లామీపై హసీనా విధించిన నిషేధాన్ని కూడా ఎత్తివేసిన సంగతి తెలిసిందే. జమాతేకు మతతత్వ పార్టీగా పేరుంది. రాజకీయ కారణాలతోనే జమాతే ఇస్లామీపై హసీనా ప్రభుత్వం నిషేధం విధించిందని.. అందుకే దాన్ని ఎత్తివేస్తున్నామని ప్రస్తుత ప్రభుత్వం వెల్లడించింది. మరోవైపు భారత్- బంగ్లా సంబంధాలపై జమాతే ఇస్లామీ అధినేత షఫీకుర్ రహమాన్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలనే తాము కోరుకుంటున్నామని తెలిపారు. అయితే ద్వైపాక్షిక సంబంధాల పేరుతో ఇతర దేశాల అంతర్గత అంశాల్లో జోక్యం చేసుకోవడం భారత్ మానుకోవాలన్నారు. అమెరికా, చైనా, పాకిస్థాన్‌లతోనూ బంగ్లా సన్నిహిత సంబంధాలు నెరపాలని రహమాన్ తెలిపారు.




కష్టాల్లో ఉన్నవారికి సాయం అందించడానికి ఎప్పుడూ ముందుంటారు నటుడు ఎన్టీఆర్. తాజాగా ఆయన మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ.కోటి విరాళంగా ఇచ్చారు. ఈమేరకు తన ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల కలిగిన వరద బీభత్సం నన్ను ఎంతగానో కలచివేసింది. అతి త్వరగా ఈ విపత్తు నుంచి తెలుగు ప్రజలంతా కోలుకోవాలని నేను దేవుడిని ప్రార్థిస్తున్నాను. వరద విపత్తు నుంచి ఉపశమనం కోసం రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తీసుకొనే చర్యలకు సహాయపడాలని నావంతుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల సహాయనిధికి చెరొక రూ.50 లక్షలు విరాళంగా ప్రకటిస్తున్నాను' అని తెలిపారు.

**రూ.30లక్షలు ప్రకటించిన సిద్ధూ జొన్నలగడ్డ :** తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితుల సహాయార్థం సిద్ధూ జొన్నలగడ్డ రూ.30 లక్షలు విరాళం ప్రకటించారు. 'తెలుగు రాష్ట్రాలను వరదలు ముంచెత్తడం చాలా బాధాకరమైన విషయం. ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూస్తుంటే ఇంకెవ్వరికీ ఇలాంటి పరిస్థితి రాకూడదు అనిపిస్తోంది.

ఈ వరదలు చాలా కుటుంబాలను కష్టాల్లోకి నెట్టేశాయి. ఇలాంటి సమయాల్లో మనం ఒకరికొకరు తోడుగా ఉండడం అత్యవసరం. వరద బాధితులకు నా వంతు సహకారంగా రూ.30 లక్షల (ఏపీ, తెలంగాణకు రూ.15 లక్షలు చొప్పున) ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాను. ఇది కొంతమందికైనా ఏదో ఒక విధంగా ఉపయోగపడుతుందనిఆశిస్తున్నాను' అని పేర్కొన్నారు.

**తెలుగు రాష్ట్రాలకు రూ.10 లక్షల సాయం: విష్వక్‌సేన్ –** తెలుగు రాష్ట్రాల్లోని ప్రజల కోసం విష్వక్‌సేన్ తనవంతు సాయం చేశారు. రూ.10 లక్షలు విరాళంగా ప్రకటించారు. 'ఈ విపత్తు సమయంలో వరద సహాయక చర్యలకు మద్దతుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఎంల సహాయనిధికి రూ.10 లక్షలు విరాళంగా ఇస్తున్నాను. వరదల వల్ల నష్టపోయిన వారి బాధలను తగ్గించే దిశగా ఈ సహకారం ఒక చిన్న అడుగు' అని పోస్ట్ పెట్టారు.ఇటీవల కురిసిన వర్షాలకు రెండు తెలుగు రాష్ట్రాల్లో వరద బీభత్సం సృష్టిస్తోంది. దీంతో సినీప్రముఖులు బాధితులకు అండగా నిలుస్తున్నారు. తాజాగా ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్ కు రూ.25 లక్షల విరాళం ఇస్తున్నట్టు వైజయంతి మూవీస్ ప్రకటించింది. అలాగే, 'ఆయ్' చిత్ర బృందం సైతం వరద బాధితులకు ఆర్థికసాయం చేయాలని నిర్ణయించుకుంది. సోమవారం నుంచి వారాంతం వరకూ ఆ సినిమాకి రానున్న వసూళ్లలో నిర్మాత షేర్‌లో 25 శాతాన్ని జనసేన పార్టీ తరఫున విరాళంగా అందజేయనున్నట్లు ప్రకటించింది.




## ప్రకాశం బ్యారేజీ పటిష్ఠంగా ఉంది: కన్నయ్యనాయుడు

విజయవాడ: ప్రకాశం బ్యారేజీ గేట్లను ఇంజినీరింగ్ నిపుణుడు, జలవనరుల శాఖ సలహాదారు కన్నయ్యనాయుడు పరిశీలించారు. అధికారులతో కలిసి ఆయన అక్కడికి చేరుకున్నారు. బ్యారేజీ గేట్ల నిర్వహణ కోసం నిర్మించిన అయిస్ట్ బ్రిడ్జి ఎక్కి పరిశీలించారు. రెండు గేట్లు స్వల్పంగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. బ్యారేజీ పటిష్ఠంగా ఉన్నట్లు నిర్ధరించారు. గేట్లు ఎత్తడం, మూయడం కోసం ఏర్పాటు చేసిన మెకానిజం, మోటార్ యంత్రాల పనితీరును తెలుసుకున్నారు.

**బోట్ల తొలగింపునకు కాకినాడ నుంచి నిపుణులు! :** తొలుత గేట్లకు అడ్డంగా ఉన్న బోట్లను తొలగించాలని అధికారులకు కన్నయ్యనాయుడు సూచించారు. వాటిని తొలగించాకే మరమ్మతులు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. బ్యారేజీలో వరద 5 లక్షల క్యూసెక్కులకు తగ్గాకే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మరోవైపు దీనికి సంబంధించిన పర్యవేక్షణ బాధ్యతను జలవనరుల శాఖ మాజీ మంత్రి దేవినేని ఉమా చేపట్టారు. బ్యారేజీ వద్ద కన్నయ్యనాయుడితో పాటు పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకుంటున్నారు. బోట్లు తొలగించేందుకు కాకినాడ నుంచి నిపుణులను రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.




కృష్ణమ్మ శాంతించింది. వరద ఉద్ధృతి నెమ్మదించింది. ప్రకాశం బ్యారేజీ వద్ద వద్ద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో దిగువన ఉన్న తీర ప్రాంతాలు క్రమంగా బయటపడుతున్నాయి. బ్యారేజీ మొత్తం 70 గేట్లు తెరిచి సముద్రంలోకి నీటిని విడుదల చేస్తున్నారు.

# 50లోనూ ఇంత అందం ఏంటి మేడం

రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన రంగీలా సినిమాతో హిందీతో పాటు సౌత్ ప్రేక్షకులను కూడా తన అభిమానులుగా మార్చుకున్న ఊర్మిళ మటోండ్కర్. కేవలం సినీ నటిగా మాత్రమే కాకుండా రాజకీయ నాయకురాలిగా కూడా ఊర్మిళ సుపరిచితురాలు. చైల్డ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఊర్మిళ హీరోయిన్ గా టర్న్ అయ్యి సుదీర్ఘ కాలం పాటు టాప్ స్టార్ హీరోయిన్ గా సినిమాలు చేస్తూ వచ్చింది. కేవలం హిందీలో మాత్రమే కాకుండా తెలుగు, తమిళ భాషల్లో కూడా నటించడం తో దేశ వ్యాప్తంగా గుర్తింపు సొంతం చేసుకుంది. వర్మ హీరోయిన్ గా పేరు పడ్డ ఊర్మిళ 2010 వరకు కంటిన్యూగా సినిమాలు చేస్తూ వచ్చింది. ఊర్మిళ ప్రస్తుత ఏజ్ 50 ఏళ్లు. ఆమె వయసు పెరిగిన కొద్దీ అందం పెరిగిందా అన్నట్లుగా పెరుగుతూ వచ్చింది. తాజాగా సోషల్ మీడియాలో ఊర్మిళ షేర్ చేసిన అందమైన ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. 50 ఏళ్ల వయసులో ఇంత అందం మరే హీరోయిన్ కి సాధ్యం కాకపోవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. చాలా మంది ఊర్మిళ వయసు 50 ఏళ్లు అయ్యి ఉండక పోవచ్చు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. 30 ఏళ్ల వయసులో హీరోయిన్స్ ఎంత అందంగా ఉంటారో అంతే అందంగా ఈ 50 ఏళ్ల వయసులో కూడా ఊర్మిళ ఉందంటూ నెటిజన్స్ ఇంకా ఆమె ఫాలోవర్స్ కామెంట్స్ చేస్తున్నారు. 1977 లో కర్మ అనే చిత్రంతో బాల నటిగా అరంగేట్రం చేసిన ఊర్మిళ 1983 లో చేసిన



మటోండ్కర్ సినిమాతో మంచి గుర్తింపు సొంతం చేసుకుంది. మలయాళంలో అప్పట్లో చాణక్య సినిమాలో నటించింది. 1991 లో హిందీ సినిమా నరసింహా తో హీరోయిన్ గా బాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా ఫలితం తో సంబంధం లేకుండా అందమైన ఊర్మిళ కి వరుసగా ఆఫర్లు వచ్చాయి. తెలుగు లో ఊర్మిళ అంతం సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. రామ్ గోపాల్ వర్మ తో అప్పటి నుంచే ఊర్మిళ కి పరిచయం ఏర్పడింది. ఆయన దర్శకత్వంలో వచ్చిన రంగీలా సినిమా ఊర్మిళ కెరీర్ ను పూర్తిగా మార్చేసింది. 1995 లో వచ్చిన రంగీలా సినిమాకు గాను ఊర్మిళ ఫిల్మ్ ఫేర్ అవార్డ్ కి నామినేట్ అయ్యింది. ఆ సినిమా తో కుర్రకారు హృదయాలను కొల్లగొట్టిన ఊర్మిళ ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోకుండా ఏడాదికి మూడు నాలుగు సినిమాల చొప్పున చేస్తూ వచ్చింది. సౌత్ స్టార్ హీరోల సినిమాలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా చేసింది. భారతీయుడు సినిమా లో ఊర్మిళ నటించి మరోసారి పాన్ ఇండియా స్టార్ హీరోయిన్ అనిపించుకుంది. అప్పట్లోనే ఊర్మిళ కు హిందీ తో పాటు అన్ని భాషల్లో కూడా మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉండేది. ఇప్పటికి కూడా ఆమె స్టార్ డమ్ ఏమాత్రం తగ్గలేదు. కానీ ఆమె మాత్రం పెద్దగా సినిమాలపై ఆసక్తి చూపడం లేదు. ఇంకా ఇంత అందంగా ఉన్న ఊర్మిళ కనుక నటిస్తే సీనియర్ స్టార్ హీరోలు ఈమె తో నటించేందుకు ఆసక్తి చూపించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

# తమన్నా ఇదే రిపీట్ అయితే

స్టార్ హీరోయిన్ తమన్నాకు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. కొన్నేళ్లుగా హీరోయిన్ గా తన సత్తా చాటుతున్న అమ్మడు.. స్పెషల్ సాంగ్స్ తోనూ ఓ రేంజ్ లో అందరినీ అలరిస్తోంది. హీరోయిన్స్ లో తమన్నా కాస్త గ్రేస్ ఫుల్ డ్యాన్సర్ అనే చెప్పాలి. ఆమె ఐటెం సాంగ్ చేస్తే మూవీకి ఎక్స్ ట్రా మైలేజీ వస్తుంది. అందరి దృష్టి సినిమాపై పడుతుంది. కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అల్లుడు శీను మూవీలో లబ్బర్ బొమ్మ పాటలో డ్యాన్స్ ఇరగదీసింది తమన్నా. అ తర్వాత జై లవకుశ, గని, స్పీడున్నోడు సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ తో అలరించింది. అయితే ప్రతి సాంగ్ కూడా సూపర్ డూపర్ హిట్టే. ఇక రీసెంట్ గా కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ జైలర్ సినిమాలో నువ్వు కావాలయ్యా పాటతో ఓ ఊపు ఊపేసింది. గ్లామర్ డోస్ పెంచేసి మరీ స్టెప్పులేసింది. ఇప్పటికే ఈ పాట ట్రెండింగ్ లోనే ఉంటుంది. జైలర్ మూవీకి రిలీజ్ కు ముందు క్రియేట్ అయిన హైప్.. తమన్నా వల్లే వచ్చిందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. ఇప్పుడు తమన్నా మరో ఐటెం సాంగ్ తో వచ్చేస్తున్న విషయం తెలిసిందే.



బాలీవుడ్ స్త్రీ 2 మూవీలో ఆజ్ కా రాత్ స్పెషల్ సాంగ్ తో సందడి చేయనుంది అమ్మడు. 2018లో వచ్చిన స్త్రీ మూవీలో నోరా ఫతేహి ఐటెం సాంగ్ చేయగా.. ఇప్పుడు సీక్వెల్ లో తమన్నా చిందులేసింది. అందుకు సంబంధించిన వీడియో సాంగ్ ను మేకర్స్ రీసెంట్ గా రిలీజ్ చేశారు. పాటలో తన డ్యాన్స్ తో అందరినీ ఆకట్టుకుంటోంది మిల్కీ బ్యూటీ. గ్లామర్ బొనాంజాతో బీటౌన్ ఆడియన్స్ ను అలరిస్తోంది. తమన్నా డ్యాన్స్ చూసి బాలీవుడ్ సినీ ప్రియులు ఆశ్చర్యపోతున్నారు. ఆమె లుక్స్ కు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇప్పటికే చేసిన ఐటెం సాంగ్స్ కంటే.. ఆజ్ కా రాత్ పాటలో తమన్నా మరింత గ్లామర్ షో చేసింది. తన స్కిన్ టోన్ తోపాటు అందాలతో అలరించింది. అయితే కొందరు మాత్రం కంటిన్యూగా గ్లామర్ షోతో స్పెషల్ సాంగ్స్ చేయడం కరెక్ట్ కాదని చెబుతున్నారు.

వరుస గ్లామర్ ట్రీట్స్.. ఆడియన్స్ కు బోర్ తెప్పించే అవకాశం ఉందని అంటున్నారు. అయితే సిమ్రాన్, ఇలియానా వంటి పలు హీరోయిన్లు తమ గ్లామర్ షోతో ఓ రేంజ్ లో అలరించారు. కానీ ఒక్కసారిగా డౌన్ అయిపోయారు.




# 'ది గోట్' రొమాంటిక్ సెల్ఫీ అదుర్స్



తమిళ్ సూపర్ స్టార్ విజయ్ రాజకీయ రంగ ప్రవేశం కన్ఫర్మ్ అయింది. ఇటీవలే ఆయన తన పార్టీ జెండాను కూడా ఆవిష్కరించి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించబోతున్నట్లు అభిమానులతో చెప్పకనే చెప్పాడు. విజయ్ రాజకీయం పై తమిళనాడు తో పాటు మొత్తం దేశం మొత్తం ఆసక్తి నెలకొంది. త్వరలో పూర్తి స్థాయిలో రాజకీయ నాయకుడిగా మారబోతున్న విజయ్ నటించిన తాజా చిత్రం ది గోట్. సాధారణంగా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వాలని భావించినప్పుడు పొలిటికల్ డ్రామా సినిమాలను చేసేందుకు ఆసక్తి చూపిస్తూ ఉంటారు. కానీ ది గోట్ లో పొలిటికల్ యాంగిల్ ఉన్నట్లుగా అనిపించడం లేదు. విజయ్ చివరి సినిమాగా ది గోట్ ను కొందరు ఫ్యాన్స్ తో పాటు తమిళ్ మీడియా వర్గాల వారు ప్రచారం చేస్తున్నారు. దాంతో ది గోట్ పై తమిళ్ ఆడియన్స్ లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. సాధారణంగానే విజయ్ సినిమా అంటే తమిళనాట ఓ రేంజ్ వసూళ్లు నమోదు అవుతాయి. విజయ్ చివరి సినిమా అనే ప్రచారం జరిగిన నేపథ్యంలో అంతకు మించి వసూళ్లు నమోదు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ వారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ది గోట్ సినిమా కు తెలుగు రాష్ట్రాల్లో మాత్రం పెద్దగా బజ్ క్రియేట్ అవ్వలేదు. అసలు ప్రచారం లేకుండానే రిలీజ్ కి రెడీ చేస్తున్నారు. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్ ప్రారంభం అయ్యింది. తమిళ్ తో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ది గోట్ కి రెస్పాన్స్ బాగానే ఉందని మేకర్స్ అంటున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి విజయ్ ఇంకా హీరోయిన్ మీనాక్షి చౌదరి ఫోటోను షేర్ చేశారు. విజయ్ ను రెండు విభిన్నమైన పాత్రల్లో, తండ్రి కొడుకులుగా చూడబోతున్నాం. కొడుకు పాత్రను మరీ వయసు తక్కువగా చూపించారు. అందుకోసం ఉపయోగించిన టెక్నాలజీ బాగుందంటూ నెటిజన్లు ఈ ఫోటోను చూసి కామెంట్స్ చేస్తున్నారు. విజయ్ హెయిర్ స్టైల్ తో పాటు, ఔట్ ఫిట్ భలే ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. గుంటూరు కారం సినిమా తర్వాత మీనాక్షి చౌదరి కి దక్కిన మరో భారీ చిత్రం ది గోట్, అది కాకుండా తమిళ్ సూపర్ స్టార్ తో నటించిన సినిమా అవ్వడంతో అందరి దృష్టి ఈ అమ్మడి కెరీర్ పై పడింది. చిన్న సినిమాల హీరోయిన్ గా కెరీర్ ఆరంభంలో సినిమాలు చేసిన ఈ అమ్మడు గుంటూరు కారం సినిమాలో సెకండ్ హీరోయిన్ గా నటించి, ది గోట్ లో మెయిన్ హీరోయిన్ గా నటించింది. ది గోట్ లో మీనాక్షి తో పాటు మాళవిక శర్మ కూడా నటించింది. కానీ అందరి దృష్టి కూడా మీనాక్షి చౌదరి పై నే ఉంది. విజయ్ తో రొమాంటిక్ సెల్ఫీ తీసుకుంటూ కనిపిస్తున్న మీనాక్షి చౌదరి అప్‌కమింగ్ స్టార్ హీరోయిన్ అంటూ అందరితో అనిపించుకుంటోంది. తమిళ్ లో ఈ సినిమా తర్వాత మీనాక్షి ఫుల్ బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

# సోలోగా బాక్సాఫీస్ ని షేక్ చేసే సత్తా మాలోనూ!



ఒకప్పుడు బాలీవుడ్ లో లేడీ ఓ రియేంటెడ్ చిత్రాలంటే చాలా తక్కువగానే కనిపించేవి. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. అక్కడా లేడీ ఓరియేంటెడ్ చిత్రాల జోరు పుంజుకుంటుంది. స్టార్ హీరోయిన్లు అంతా సోలో గానూ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతున్నారు. దీపికా పదుకొణే, కరీనా కపూర్, రాణీ ముఖర్జీ, విద్యాబాలన్, టబు లాంటి సీనియర్ భామలు మార్కెట్ లో హీరోలకు తక్కువేం కాదని నిరూపిస్తున్నారు. ఈ మధ్య నే యువ నాయిక అలియాభట్ కూడా వాళ్ల సరసన స్థానం సంపాందించిన సంగతి తెలిసిందే. గంగుబాయి కతివాడితో దేశాన్నే ఊపేసింది. అంతకు ముందు రాజీతోనూ సంచలనం సృష్టించింది. తాజాగా ఆల్ఫా అనే స్పై చిత్రంలోనూ నటిస్తోంది. ఆమెతో పాటు శార్వరీ వాఘ్ కూడా నటిస్తోంది. ఇద్దర్నీ మెయిన్ లీడ్స్ లో పెట్టి యశ్ రాజ్ ఫిలింస్ ఈ ప్రయోగం చేస్తోంది. ఇప్పటికే ఇద్దరు మార్షల్ ఆర్ట్స్ లో ట్రైనింగ్ కూడా పూర్తి చేసారు. శివ రావెల్ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. అన్ని పనులు పూర్తి చేసుకుని ఇదే ఏడాది రిలీజ్ చేయనున్నారు. ఇక మిస్టరీ థ్రిల్లర్ %-%దో పత్తీ%-% లో కాజోల్, కృతిసనన్ కలిసి నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈసినిమాని కృతి సనన్ నిర్మిస్తోంది. ఇప్పటికే షూటింగ్ కూడా పూర్తయింది. ఇదొక సైకో థ్రిల్లర్. శశాంక్ చతుర్వేది తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. త్వరలోనే సినిమా నెట్ ఫ్లిక్స్ లో రిలీజ్ కానుంది. అలాగే ప్రియాంక చోప్రా, కత్రినా కైఫ్, అలియ భట్ ప్రధాన పాత్రల్లో జీలే జర పర్హాన్ అక్తర్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఈ సినిమా ఇప్పటికే ఆలస్యమవుతోన్న నేపథ్యంలో డిలే చేయకుండా చూడాలని పర్హాన్ ముందుకు కదులు తున్నాడు. అలాగే కళాత్మక చిత్రాల దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీహీరామండి సీజన్ -2కి రంగం సిద్దం చేస్తున్నారు. మొదటి సీజన్ మంచి విజయం సాధించడంతో అదే నటుల్ని కొనసాగిస్తూ..కొత్త నటీనటుల్నీ యాడ్ చేసుకుని సీజన్-2 ప్లాన్ చేస్తున్నాడు. ఇక కీర్తి సురేష్ అక్క అనే వెబ్ సిరీస్ తో బాలీవుడ్ లో లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఈ సస్పెన్స్ థ్రిల్లర్ ని ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు.

# ప్రగ్యా సర్‌ప్రైజింగ్ అందాల షో

తమిళ చిత్రం 'విరాటు' తో 2014లో సినీ రంగ ప్రవేశం చేసిన ప్రగ్యా జైస్వాల్ తెలుగు లో కూడా అదే టైమ్ లో ఎంట్రీ ఇచ్చింది. తెలుగు లో మొదటి సినిమా మిర్చి లాంటి కుర్రాడు సినిమా నిరాశ పరిచింది. మొదటి సినిమా నిరాశ పరచినా కూడా 'కంచె' సినిమాలో నటించే అవకాశం ప్రగ్యాకు వచ్చింది. క్రిష్ దర్శకత్వంలో కంచె సినిమాలో మెగా హీరో వరుణ్ తేజ్ కి జోడీగా ప్రగ్యా జైస్వాల్ నటించింది. ఆ సినిమా తో ఒక్కసారిగా టాలీవుడ్ లో ఫేమస్ అయ్యింది. కంచె సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు, ఆ సినిమాలో ప్రగ్యా అందానికి, నటనకు మంచి మార్కులు పడ్డాయి. కంచె సినిమా తర్వాత టాలీవుడ్ లో ప్రగ్యా వరుసగా ఆఫర్లు దక్కించుకునే అవకాశం ఉందని అంతా భావించారు. కానీ ఆమె ఎత్తు టాలీవుడ్ లో ఉన్న చాలా మంది యంగ్ హీరోల కంటే కాస్త ఎక్కువగానే ఉంది. దాంతో ప్రగ్యా తో నటించేందుకు చాలా మంది ఆసక్తి చూపించ లేదు. కంచె తర్వాత ఆమె చేసిన సినిమాలు కొన్ని పర్వాలేదు అనిపించుకోగా, ఎక్కువ సినిమాలు బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడ్డాయి. అయినా కూడా ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంది. బాలయ్యకు జోడీగా నటించిన అఖండ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. అయినా కూడా ఆశించిన స్థాయిలో ఈమెకు ఆఫర్లు రాలేదు. సినిమాల్లో



ఆఫర్లతో సంబంధం లేకుండా సోషల్ మీడియాలో ఈమె అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. అన్ని భాషల నెటిజన్స్ ప్రగ్యా జైస్వాల్ యొక్క అందమైన ఫోటోలకు ఫిదా అవుతూ ఉంటారు. నెట్టింట ఆమె షేర్ చేసే ఫోటోలు రెగ్యులర్ గా వైరల్ అవుతున్నాయి. తాజాగా మరోసారి ప్రగ్యా జైస్వాల్ అందమైన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈసారి లేత గోధుమ రంగు లో ప్రగ్యా సర్‌ప్రైజింగ్ అందాల షో కు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. ఈ స్థాయిలో అందంగా ఉన్నా కూడా పాపం ప్రగ్యా జైస్వాల్ కు దక్కాల్సిన గుర్తింపు దక్కలేదు, రావాల్సిన ఆఫర్లు రావడం లేదు అనే కామెంట్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి. అఖండ సినిమా తర్వాత టాలీవుడ్ లో ఈ అమ్మడు బాలకృష్ణ తో మరోసారి నటిస్తోంది. బాలకృష్ణ, బాబీ కాంబోలో రూపొందుతున్న సినిమాలో ఒక హీరోయిన్ గా ప్రగ్యా కనిపించబోతుందనే వార్తలు చాలా రోజులుగా వస్తున్నాయి. ఇప్పటి వరకు మేకర్స్ నుంచి మాత్రం అధికారిక ప్రకటన రాలేదు. సినిమా టైటిల్ ను ప్రకటించిన సమయం లో ప్రగ్యా పాత్ర గురించి మేకర్స్ ఒక క్లారిటీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. బాలయ్య 109వ సినిమాను ఇదే ఏడాది డిసెంబర్ లో విడుదల చేయాలని భావిస్తున్నారు. బాలయ్య సినిమా వచ్చిన తర్వాత అయినా ప్రగ్యాకు మళ్లీ వరుస ఆఫర్లు వస్తాయేమో చూడాలి.

# స్వర్గం నుంచి దిగి వచ్చిన రాజకుమారి

పెళ్లి సందడి సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ శ్రీలీల. ఈ అమ్మడు మొదటి సినిమాతో నిరాశ పరిచిన కూడా ధమాకా సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ధమాకా తర్వాత ఈ అమ్మడు బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేయడం మొదలు పెట్టింది. శ్రీలీల హీరోయిన్ గా ఒకానొక సమయంలో ఏకంగా పది సినిమాలు ఏక కాలంలో చేసిన విషయం తెల్సిందే. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు నిరాశ పరిచినా కూడా శ్రీలీల ధమాకా కంటిన్యూ అవుతూనే ఉంది. ప్రస్తుతం కూడా ఈ అమ్మడి



చేతిలో మూడు నాలుగు సినిమాలు ఉన్నాయి. ఈ అమ్మడి ఫోటోలు సోషల్ మీడియాలో రెగ్యులర్ గా వైరల్ అవుతూ ఉన్నాయి. తాజాగా మరోసారి శ్రీలీల ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. తాజాగా ఈ ఫోటోలను షేర్ చేసిన ఫ్యాన్స్ మా శ్రీలీల బంగారం అంటూ నెట్టింట కామెంట్స్ చేస్తూ తెగ వైరల్ చేస్తున్నారు. స్వర్గం నుంచి దిగి వచ్చిన రాజకుమారి మా శ్రీలీల అంటూ ఈ ఫోటోలకు నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉన్నారు. నిజంగానే శ్రీలీల ఈ ఔట్ ఫిట్ లో చాలా అందంగా ఉందని, స్వర్గం నుంచి దిగి వచ్చింది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ స్థాయిలో అందాల ఆరబోత చేస్తుంది కనుకే ఇండస్ట్రీలో బిజీ బిజీగా ఉందనే కామెంట్స్ వస్తున్నాయి.



# ఖమ్మంలో ఆక్రమణల వల్లే భారీ వరదలు

ఖమ్మం: ఆక్రమణల వల్లే ఖమ్మంలో భారీగా వరదలు వచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మున్నేరు రిటైనింగ్ వాల్ ఎత్తు పెంపుపై ఇంజినీర్లతో చర్చిస్తామని చెప్పారు. సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్స్ ద్వారా గుర్తించి ఆక్రమణలు తొలగిస్తామని వెల్లడించారు. 75 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా 42 సెం.మీ వర్షం పడిందన్నారు. ప్రభుత్వ ముందుచూపు వల్లే ప్రాణ నష్టం తగ్గిందని వివరించారు. ఖమ్మంలో మీడియా ప్రతినిధులతో సీఎం చిట్‌చాట్ నిర్వహించారు. వరదలపై మాజీ మంత్రి హరీశ్ రావు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని రేవంత్ మండిపడ్డారు. భారాస నేత పువ్వాడ ఆక్రమణలపై హరీశ్ స్పందించాలని వ్యాఖ్యానించారు. ఆక్రమించిన స్థలంలో పువ్వాడ ఆస్పత్రి కట్టారని.. వాటిని తొలగించాలని ఆయనకు హరీశ్ చెప్పాలని సూచించారు. వరద సాయం కోసం కేంద్రానికి లేఖ రాసినట్లు సీఎం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల సాయం ప్రకటించినట్లు చెప్పారు.



# 30వేల ఎకరాల్లో పంటనష్టం.. రైతులను ఆదుకుంటాం: సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. జిల్లాలో పర్యటించిన ఆయన.. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కతో కలిసి వరదలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో నలుగురు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. దాదాపు 30వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని వెల్లడించారు. సహాయచర్యల్లో నిరంతరం పనిచేసిన రెవెన్యూ, పోలీసు సిబ్బందిని అభినందించారు. "అధికారుల చర్యలతో ప్రాణనష్టం తగ్గించగలిగాం. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం ప్రకటించాం.

పంట నష్టం అంచనా వేసి పరిహారం అందజేస్తాం. నష్టపోయిన మూడు తండాలవాసులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం. నష్టంపై కేంద్రానికి నివేదించడానికి నివేదిక తయారు చేయాలి. కేంద్రం దీన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి. ఆస్తి, ప్రాణ నష్ట పరిశీలనకు ప్రధాని మోదీని ఆహ్వానించాం. తక్షణమే రాష్ట్రానికి రూ.2వేల కోట్లు కేటాయించాలి. వర్షం తగ్గినందున బురద తొలగించే పనులు అధికారులు ప్రారంభించాలి. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తే ఇళ్లలోని బురద తొలగించవచ్చు. విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంది.. మరింత జాగ్రత్తగా ఉండాలి. ఎంత ఒత్తిడి ఉన్నా హైడ్రా ఏర్పాటు చేసి ఆక్రమణలను కూల్చేస్తున్నాం. ప్రకృతి ప్రకోపిస్తే ఏం జరుగుతుందో మనం ఇతర రాష్ట్రాల్లో చూస్తున్నాం. చెరువులు, నాలాల ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుంది. ఆక్రమణలకు సహకరించిన వారిపై కూడా చర్యలు ఉంటాయి. పేదల ప్రాణాలు పోయాక ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తూ కూర్చోదు.

పువ్వాడ ఆక్రమణలు తొలగించాలని హరీశ్‌రావు డిమాండ్ చేయగలరా? ఆక్రమణల తొలగింపునకు హరీశ్‌రావు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తారా? చెరువులను ఆక్రమించిన వారు ఎంతటివారైనా తొలగించాల్సిందే. ఆక్రమణల తొలగింపునకు విధివిధానాలు రూపొందించాలి"అని సీఎం రేవంత్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఆక్రమణలు.. కూల్చివేసిన హైడ్రా

అమీన్‌పూర్: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఐలాపూర్ తండా, అమీన్‌పూర్‌లో ఆక్రమణలను కూల్చివేసింది. ఐలాపూర్ తండాలో ఆక్రమించిన సుమారు 20 ఎకరాల భూమిని రక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. సర్వే నంబర్ 119లో గుర్తుతెలియని వ్యక్తులు ప్లాట్లు వేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో హైడ్రా, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి కట్టడాలు, సరిహద్దు రాళ్లను తొలగించారు. అనంతరం ఫ్యుజన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఆక్రమణలు కూల్చివేశారు. 15 గుంటల భూమి ఆక్రమించి గదులు, ప్రహరీ నిర్మాణం చేపట్టినట్లు హైడ్రా గుర్తించింది. హైడ్రా ఆదేశాలతో రెవెన్యూ అధికారుల కూల్చివేతలు చేపట్టారు.



# సహాయక చర్యల్లో విఫలం.. అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లాలి: హరీశ్‌రావు



ఖమ్మం: భారీ వర్షాలు, వరదల కారణంగా 30మంది చనిపోతే.. కేవలం 15 మందే చనిపోయారని చెబుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. చనిపోయిన వారి సంఖ్యను కూడా ప్రభుత్వం తక్కువగా చూపుతోందన్నారు. వరద ప్రాంతాలను పరిశీలించిన అనంతరం భారాస నేతలతో కలిసి ఖమ్మంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సాగర్ ఎడమకాలువకు గండి పడిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఆరోపించారు. ''వరద బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. నిత్యావసరాలు సహా దస్త్రాలు, పుస్తకాలు కూడా కొట్టుకుపోయాయి. ఇళ్లపై నిలబడిన వరద బాధితులకు ఆహారం కూడా అందించలేదు. వరద సహాయక చర్యల్లో ప్రభుత్వ వైఫల్యం కనిపిస్తోంది. రాష్ట్రానికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కేంద్రం ఎందుకు పంపలేదు. రాష్ట్రాన్ని ఆదుకోవడంలో కేంద్ర ప్రభుత్వం కూడా విఫలమైంది. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లాలి. అందరం కలిసి వెళ్లి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి ఖమ్మం, మహబూబాబాద్ ప్రజలు బలైపోయారు. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.25లక్షలు ఇవ్వాలి. నష్టపోయిన వారికి తక్షణమే రూ.2లక్షల పరిహారం ఇవ్వాలి. వర్షం తగ్గి రెండ్రోజులు అయినా.. విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు. మంచినీరు, ఆహారం కూడా సరఫరా చేయలేదు. వరద బాధితులకు 5 కిలోల బియ్యం ఇస్తే ఎలా వండుకుంటారు?"అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# ఖమ్మంలో కాంగ్రెస్, భారాస శ్రేణుల మధ్య ఘర్షణ.. రాళ్లదాడి

ఖమ్మం: వరద బాధితులను పరా మర్శించే క్రమంలో భారాస, కాంగ్రెస్ శ్రేణు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఖమ్మం నగరంలోని బొక్కలగడ్డలో వరద బాధితులను పరామర్శించేందుకు భారాస నేతలు వెళ్లారు. అదే సమయంలో కాంగ్రెస్ శ్రేణులు అక్కడే ఉండటంతో ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తలు పరస్పరం నినాదాలు చేసుకున్నారు. అనంతరం రాళ్లు రువ్వుకున్నారు. రాళ్ల దాడిలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కారు ధ్వంసమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఇరువర్గాలను అదుపు చేశారు.





# అత్యవసర ఆపరేషన్‌కు వెళ్తూ కూలిన హెలికాప్టర్

ముంబయి: భారత తీర గస్తీ దళానికి చెందిన ఓ తేలికపాటి హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. అత్యవసర ఆపరేషన్‌కు వెళ్తుండగా అరేబియా సముద్రంపై ఎమర్జెన్సీ ల్యాండ్ అవుతూ కూలిపోయింది. ఈ ఘటనలో సిబ్బంది ఒకరిని కోస్ట్‌గార్డ్ సిబ్బంది రక్షించగా.. మరో ముగ్గురు గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. పోర్‌బందర్‌కు 45 కిలోమీటర్ల దూరంలో అరేబియా సముద్రంలో ఉన్న మోటార్ ట్యాంకర్ హరిలీలాలో ఓ సిబ్బందికి తీవ్ర గాయమైంది.

దీంతో ఆ ట్యాంకర్ మాస్టర్ నుంచి తీర గస్తీ దళానికి అత్యవసర సందేశం అందింది. గాయపడిన ఆ సిబ్బందిని తరలించేందుకు సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో కోస్ట్‌గార్డ్‌కు చెందిన అధునాతన తేలికపాటి హెలికాప్టర్ బయల్దేరింది. మార్గమధ్యలో ఇందులో సమస్య తలెత్తి సముద్రంపై ఎమర్జెన్సీ ల్యాండ్ అవ్వాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. ఈ ఘటన సమయంలో అందులో నలుగురు సిబ్బంది ఉన్నారు. అప్రమత్తమైన కోస్ట్‌గార్డ్ దళాలు తక్షణమే సహాయక చర్యలు చేపట్టాయి. హెలికాప్టర్ శకలాన్ని గుర్తించి అందులో ఓ సిబ్బందిని కాపాడారు. మరో ముగ్గురు గల్లంతవగా వారి కోసం గాలింపుచర్యలు చేపట్టారు. నాలుగు నౌకలు, రెండు ఎయిర్‌క్రాఫ్ట్‌లతో సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు కోస్ట్‌గార్డ్ అధికారులు వెల్లడించారు.

ఈ ప్రమాదానికి గురైన హెలికాప్టర్ ఇటీవల గుజరాత్ వర్షాల సమయంలో 67 మందిని కాపాడి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు.





# రైతులకు సీఎం రేవంత్ గుడ్ న్యూస్.. ఎకరానికి 10వేలు!

హైదరాబాద్ : తెలంగాణలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు అల్లకల్లోలం సృష్టించాయి. కుండపోత వర్షాలతో రాష్ట్రం చిగురుటాకులా వణికిపోయింది. భారీ వర్షాలతో వరదలు బీభత్సం సృష్టించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రవాణా వ్యవస్థ స్థంభించిపోయింది. జనజీవనం అస్తవ్యస్తమైంది. ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలు వణికించాయి. మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఖమ్మం నగరంలోని పలు కాలనీలు నీట మునిగాయి. కాగా వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ క్రమంలో వరదల్లో ఇళ్లు దెబ్బతిన్న వారికి తక్షణ సాయంకింద రూ. 10 వేలు ప్రకటించారు. అదే విధంగా రైతులకు గుడ్ న్యూస్ అందించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 10 వేలు పరిహారం ప్రకటించారు. వరద బాధితులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఖమ్మంలో వరద ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం మంత్రులతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంక్షోభ సమయంలో మంత్రులంతా ప్రజల వద్ద ఉండాలని, పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. పంట నష్టం వివరాలు సేకరిస్తున్నాం.. నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరానికి రూ.10వేలు చొప్పున పరిహారం ఇస్తాం అని తెలిపారు. వరదల కారణంగా ఎవరైనా చనిపోతే వారి కుటుంబాలకు ఇచ్చే నష్ట పరిహారాన్ని భారీగా పెంచారు. ఇదివరకు రూ. 4 లక్షలు ఇస్తుండగా తాజాగా దాన్ని రూ. 5 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు వరదల వల్ల రాష్ట్రంలో 16 మంది మరణించారని.. రూ.5,430 కోట్లు నష్టం జరిగిందని తెలిపారు. వరద బాధితులు సర్వం కోల్పోయారు. వారికి ఆహారం, తాగునీరు, మందులు అందిస్తున్నాం. ఎక్కడికక్కడ పునరావాస శిబిరాలు ఏర్పాటు చేశాం. ఈ వరదలను జాతీయ విపత్తుగా పరిగణించి నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరాం అని సీఎం రేవంత్ వెల్లడించారు.

# తెలుగు రాష్ట్రాలను ముంచెత్తిన వరదలు.. బాలకృష్ణ భారీ విరాళం



హైదరాబాద్: భారీ వర్షాల కారణంగా తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. ముఖ్యంగా కృష్ణా పరీవాహక ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈ క్రమంలో వరద బాధితులను ఆదుకునేందుకు సినీ, రాజకీయ, పారిశ్రామిక ప్రముఖులు ముందుకు వస్తున్నారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయనిధికి తమవంతు సాయం చేస్తున్నారు. తాజాగా సినీ నటుడు నందమూరి బాలకృష్ణ మరోసారి తన మంచి మనసును చాటుకున్నారు. వరద బాధితుల సహాయార్థం తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధికి రూ.50లక్షలు చొప్పున విరాళం ప్రకటించారు. 50 ఏళ్ళ క్రితం మా నాన్నగారు నా నుదుటిన దిద్దిన తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది. ఇప్పటికే నా నట ప్రస్థానం సాగుతూనే ఉంది. వెలుగుతూనే ఉంది. తెలుగు భాష ఆశీస్సులతో, తెలుగుజాతి అభిమాన నీరాజనాలతో పెనవేసుకున్న బంధం ఇది. ఈ రుణం తీరనిది. ఈ జన్మ మీకోసం.. మీ ఆనందం కోసం. నా ఈ ప్రయాణంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ప్రస్తుతం తెలుగు నేలను వరద ముంచెత్తుతోంది. ఈ విపత్కర పరిస్థితులలో బాధాతప్త హృదయంతో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షలు నా బాధ్యతగా బాధిత ప్రజల సహాయార్థం విరాళంగా అందిస్తున్నాను. రెండు రాష్ట్రాలలో మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" –మీ నందమూరి బాలకృష్ణ







# యంగ్‌టైగర్ ఎన్టీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి, నారా లోకేష్ కృతజ్ఞతలు

రెండు తెలుగు రాష్ట్రాలలో సంభవించిన వరద విపత్తు ఉపశమనం నిమిత్తం మ్యాన్ ఆఫ్ మాసెస్, యంగ్ టైగర్ ఎన్టీఆర్.. రూ. కోటి విరాళంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 50 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 50 లక్షలు.. మొత్తం రూ. కోటి రూపాయలను ఎన్టీఆర్ విరాళంగా ప్రకటించారు. ముఖ్యమంత్రి సహాయనిధిగా విరాళం ప్రకటించిన ఎన్టీఆర్‌కు అలాగే విశ్వక్సేన్‌కు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖామంత్రి నారా లోకేష్ ట్విట్టర్ వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. భారీ వర్షాలు, వరదల కారణంగా సర్వం కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వానికి సహాయంగా మేమున్నామంటూ అగ్ర నటుడు నందమూరి తారక రామారావు .. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)కి రూ.50 లక్షల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తారక్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే రూ. 5 లక్షల విరాళం అందించిన హీరో విశ్వక్సేన్‌కు కూడా సీఎం కృతజ్ఞతలు తెలిపారని తెలంగాణ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ అధికారిక ట్విట్టర్ ప్రకటించింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com